www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

AKSHITHA TV

ప్రతిక్షణం... ప్రజాపక్షం

సంపుటి : 16
సంచిక: 291

మంగళవారం సెప్టెంబర్ 29, 2026

aakshithanews | akshithatelugudaily | epaper.aakshitha.com

SIMULTANEOUSLY PUBLISHED FROM NALGONDA | RANGAREDDY | HYDERABAD | KHAMMAM | WARANGAL | MAHABUB NAGAR | KARIMNAGAR | NIZAMABAD | AMARAVATHI

చీఫ్ ఎడిటర్ : ఎం.దాస్ | పేజీలు : 08 | వెల: రూ.5.00







## 4 ఏళ్లు చదివితేనే
# లోకల్ రిజర్వేషన్

- సుప్రీంకోర్టు తీర్పు



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**
తెలంగాణలో మెడికల్ ప్రవేశాల కోసం లోకల్ రిజర్వేషన్ పొందాలంటే వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలోనే చదివి ఉండాలనే నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నడుచు కోవాల్సిందేనని తేల్చిచెప్పింది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. ఈ వ్యవహారంలో గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను

మిగతా 2లో..

## టీజీపీఎస్సీ పరీక్షల
# షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ 24 నుంచి నవంబర్ 13 వరకు నియామక పరీక్షలు




**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**
వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇప్పటికే ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసిన కమిషన్.. తాజాగా పరీక్షల తేదీలను వెల్లడించింది. మొత్తం నాలుగు నియామక పరీక్షలను అక్టోబర్ 24 నుంచి నవంబర్ 13 వరకు నిర్వహించనుంది. అన్ని పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు స్పష్టం

మిగతా 2లో..

# రీ చార్జీలకు 30 రోజుల వ్యాలిడిటీ

- ఏడాదికి 13 నుంచి 12 రీఛార్జ్‌లకు తగ్గింపు




**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**
మొబైల్ ప్రీపెయిడ్ వినియోగదారులకు ట్రాయ్ గుడ్ న్యూస్ చెప్పింది. 30 రోజుల వ్యాలిడిటీతో రీఛార్జ్ ప్లాన్లు, అలాగే వాయిస్, మెసేజ్ మాత్రమే ఉండే ప్లాన్లు అందుబాటులోకి తీసుకురావాలని టెలికాం కంపెనీలను ట్రాయ్ ఆదేశించింది. టెలికాం వినియోగదారుల సెక్యూ రిటీ (13వ సవరణ) నిబంధనలు, 2026ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎంపీ రాఘవ్ చద్దా

మిగతా 2లో..

# ప్రతి పేదింటికి సన్న బియ్యం

### ఆయకట్టుకు సాగునీరు

- కోటి 6 లక్షల మందికి రేషన్ కార్డులు
- 3 కోట్ల 48 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు 15వేల కోట్లు ఖర్చు చేసి ఉచితంగా 6 కిలోల సన్న బియ్యం పంపిణీ
- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి




**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :**
దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా 6 కిలోల సన్న బియ్యం ఇస్తున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం అయన నల్గొండ జిల్లా, మిర్యాలగూడ పట్టణంలో మిర్యాలగూడ నియోజక వర్గానికి సంబంధించి ఎస్వి గార్డెన్స్ లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అలాంటిది తాము అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కోటి 6 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని,3 కోట్ల 48 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు 15వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఉచితంగా 6 కిలోల సన్న బియ్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. మిర్యాలగూడ నియోజక వర్గంలో గతంలో 86 వేల 960 రేషన్ కార్డులు ఉంటే తాము అధికారంలోకి వచ్చాక జనవరి 2025 నుండి ఇప్పటివరకు 101688 రేషన్ కార్డులు ఇచ్చామని, మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డుల సంఖ్య ఒక లక్ష 526 కి చేరిందని తెలిపారు. గతంలో 2,56,000 మందికి రేషన్ బియ్యం ఇస్తుండగా, తాము అదనంగా 42,000 మందికి రేషన్ రేషన్ ఇస్తున్నామని, ప్రస్తుతం రెండు లక్షల 98,590 మందికి సన్న బియ్యం ఇస్తున్నామన్నారు.



మిగతా 2లో..



# బీసీలకు భరోసా! వరాల జల్లు !!

- రూ. 60 కోట్లతో కాటమయ్య రక్షణ కవచాలు
- రూ. 450 కోట్లతో స్కాలర్‌షిప్‌లు జమ
- నవంబర్ నుంచి 'రాజీవ్ యువ వికాసం' ప్రారంభం
- ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు అక్టోబర్ 15 వరకు పెంపు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**
రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బాలామాయదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే (డీబీటి పద్ధతి ద్వారా) జమ చేస్తున్నట్లు

మిగతా 2లో..




# భూ భారతితో భరోసా

- భూ సమస్యకు చెక్
- రీ సర్వేతో పరిష్కారం
- ప్రతి పేదింటికి ఇల్లు
- ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలతో తొలి దశ సర్వే
- నక్షాలు లేని మరో 413 గ్రామాల్లోనూ సమగ్ర భూసర్వే
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వనపర్తి / హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**
రాష్ట్రంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూసర్వే ఏకైక పరిష్కార మార్గమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గనిర్దేశం ప్రకారం భూసమస్యలకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల్లో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించడం జరిగిందని త్వరలో మరికొన్నింటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా నాలుగు గోడల మధ్య ఆలోచన చేయకుండా ప్రజల కోణంలో ఆలోచన చేసి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. భూ భారతి చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. వనపర్తిలో సోమవారం ఉమ్మడి

మిగతా 2లో..

# యువత సృజనాత్మకతకు బతుకమ్మ ఛాలెంజ్ వేదిక

- ఇన్ఫ్లుయెన్సర్లకు ప్రత్యేక పిలుపు
- యువ ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం
- ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**
బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026లో భాగంగా ఇన్ఫ్లుయెన్సర్ల సమావేశం సోమవారం ఎఫ్‌డీసీ కార్యాలయంలో విజయవంతంగా జరిగింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. ముకుంద రెడ్డి, ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు ఆధ్వర్యంలో, ఇన్ఫ్లుయెన్సర్ జీలా అనిల్ సమన్వయంతో ఈ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ లక్ష్యాలు, పోటీ విధివిధానాలు, వివిధ విభాగాలు, పాల్గొనే విధానం తదితర అంశాలను ఇన్ఫ్లుయెన్సర్లకు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం యువ కళాకారులు, కంటెంట్ క్రియేటర్లు, ఫిల్మ్ మేకర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఇన్ఫ్లుయెన్సర్లు విస్తృతంగా భాగస్వాములు కావాలని సూచించారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బతుకమ్మ పండుగ విశిష్టతతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా పాలనకు సంబంధించిన సమాచారాన్ని సృజనాత్మక డిజిటల్ కంటెంట్ ద్వారా

మిగతా 2లో..




# ఖైరతాబాద్ ఖాళీ!

- అభ్యర్థుల వేటలో రాజకీయ పక్షాలు

**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**
ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక ఖాయమయింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. అయితే ఈ ఉప ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు పోటీ పడనున్నాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్యనే పోరు ఉండనుంది. త్రిముఖ పోరులో గెలుపు ఎవరిదన్న లెక్కల్లో ఇప్పుడు రాజకీయ పార్టీలు ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక కీలకం కానుంది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్ విజయం

మిగతా 2లో..

# పాడిపై వేటు తప్పదా!

పాడి చుట్టూ రాజకీయం



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి :**
పాడి కౌశిక్‌రెడ్డిపై అసెంబ్లీ ద్వారానే అనర్హత వేటు వేయించే యోచనలో కాంగ్రెస్ పార్టీ ఉందని బీఆర్ ఎస్ నాయకులు బహిరంగ వ్యాఖ్యలే చేస్తున్నారు. ఇదే జరిగితే.. ఖైరతాబాద్‌తో పాటు హుజూరాబాద్ కు కూడా ఒకేసారి ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని అంచనా అంటున్నారు. అయితే.. దీనిని కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాదు.. సభను అగౌరవపరిచిన వారిపై చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ చెబుతోంది. మొత్తంగా ఇప్పుడు పాడి చుట్టూ రాజకీయం మరోసారి రాజుకుంది.

ఏడాది బడ్జెట్ సమావేశాల సమయంలో పాడి కౌశిక్ రెడ్డి సభలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా బీఆర్ ఎస్ నుంచి గెలిచి.. కాంగ్రెస్‌కు మద్దతుగా మారిన మాజీ మంత్రి కడియం శ్రీహరి ప్రసంగిస్తున్న సమయంలో ఆయనను అడ్డుకోవడంతో పాటు.. "నువ్వు" అని ఏకవచనంతో సంబోధించారు. అంతేకాదు.. దుర్భాషలాడారన్నది కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణ. అంతేకాదు.. తనను కాల్చేస్తానని కౌశిక్ రెడ్డి బెదిరించినట్టు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కడియం ఆరోపిస్తున్నారు. దీంతో వ్యవహారం ముదిరిపోయి.. అసెంబ్లీ ఎథిక్స్ కమిటీకి ఈ విషయాన్ని రిఫర్ చేశారు. ప్రస్తుతం ఈ కమిటీ తీవ్రంగా శోధిస్తోంది. పాడిపై వచ్చిన

మిగతా 2లో..

## ఇందిరమ్మ క్యాంటీన్లతో
# మహిళల ఆర్థిక పరిపుష్టి

- ఇందిరా మహిళా శక్తి
- క్యాంటీన్' ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, అక్షిత ప్రతినిధి:**
బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి ద్వారా నిర్వహించే స్ట్రీట్ వెండర్స్ కి సంబంధించిన ఎగ్స్ షాప్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.1.20 కోట్ల రూపాయల సున్నా వడ్డీ రుణాల చెక్కును అందించారు. అలాగే ముషీరాబాద్ లోని బాగ్ లింగంపల్లి వార్డ్ 163 వద్ద రూ.1.5 కోట్ల అంచనా వ్యయంతో డ్రెయిన్, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్ ఆర్వీ

మిగతా 2లో..

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY


## ఇందిరమ్మ క్యాంటీన్లతో
# మహిళల ఆర్థిక పరిపుష్టి

(మొదటి పేజీ తరువాయి)

కర్ణన్, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఇందిరమ్మ క్యాంటీన్లను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రతిరోజూ కష్టపడి పనిచేసుకుంటూ జీవనం సాగించే పేద, సామాన్య ప్రజలకు కేవలం రూ.5కే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం మహిళలకు ఆర్థిక వృద్ధి సాధించడానికి వారి చేత ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ఏర్పాటు చేస్తుందని, ప్రభుత్వం తరఫున అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తూ శాశ్వత నిర్మాణాలతో, అన్ని సౌకర్యాలతో క్యాంటీన్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నదే తెలంగాణ ప్రభుత్వం లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని మహిళలు కూడా పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలని కోరారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు గతంలో రూ.5 లక్షల వరకు అందించిన వడ్డీలేని రుణ పరిమితిని రూ.10 లక్షల వరకు పెంచిందని, గత మూడు సంవత్సరాలుగా వడ్డీలేని రుణాలపై వడ్డీని కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు.మహిళా సంఘాల ద్వారా ఇందిరమ్మ క్యాంటీన్లు నిర్వహించడంతో పాటు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కూడా అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, ఇప్పటికే 600 బస్సులకు మహిళలను యజమానులను చేసిందని గుర్తుచేశారు. పట్టణ ప్రాంతాల్లోనూ మహిళా సంఘాలకు ఈ అవకాశాలను విస్తరించాలనే ఆలోచన ఉందన్నారు.బాగ్ లింగంపల్లిలో 'ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్' ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నగరంలోని మహిళా సంఘాల ద్వారా బస్సులు కొనుగోలు చేసే అవకాశాన్ని కల్పించేందుకు అర్హత ఉన్న సంఘాలను గుర్తించి, 100 శాతం రీపేమెంట్ సామర్థ్యం ఉన్న మహిళా సంఘాలకు అవకాశం కల్పించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా బీసీ, మైనారిటీ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కుట్టు మిషన్లను అందించే కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం చేపడుతోందని, ప్రతి నియోజకవర్గంలో మహిళలకు కుట్టు మిషన్లతో పాటు అవసరమైన శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంచి సాంకేతికత కలిగిన నాణ్యమైన కుట్టు మిషన్లను అందించేలా నిర్ణయం తీసుకున్నామని, అర్హత ఉన్న మహిళలు సెప్టెంబర్ 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహిళలు కేవలం కుటుంబానికి పరిమితం కాకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని, కుటుంబాన్ని ఆర్థికంగా నడిపించే శక్తి, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మహిళలకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతే కుటుంబ సాధికారతకు, తద్వారా సమాజ అభివృద్ధికి పునాది అని, అందుకే మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వారికి వడ్డీలేని రుణాలు, ఉపాధి అవకాశాలు, శిక్షణ, కుట్టు మిషన్లు, క్యాంటీన్లు, బస్సులు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. తెలంగాణలోని ప్రతి అక్కచెల్లెమ్మ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని, స్వయం సమృద్ధి సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.?

# పాడిపై వేటు తప్పదా!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపణలు, ఆయన హావభావాలను వీడియోల రూపంలో కూడా పరిశీలన చేస్తోంది. కాగా.. ఇంతలోనే దానం వ్యవహారం ఒక కొలిక్కి వచ్చింది. దీంతో ఇప్పుడు పాడి విషయం మరింత సీరియస్ అయింది. ఎథిక్స్ కమిటీ తీసుకునే నిర్ణయం అత్యంత ముఖ్యంగా మారడంతో పాడిపై వేటు వేయించడమో.. లేక రాజీనామాకు సిఫారసు చేయడమో ఖాయమని అంటున్నారు ఎథిక్స్ కమిటీ అనేది రాజ్యాంగ బద్ధమైన కమిటీ కావడం, దీనికి స్పీకర్ అనుమతి ఉండడంతో ఈ కమిటీ నిర్ణయాన్నికోర్టుల్లో సవాల్ చేసేందుకు అవకాశం లేదని అంటున్నారు. పాడి అనర్హుడు కావడమో.. రాజీనామా చేయడమో తప్పదు. దీంతో హుజూరాబాద్‌కు కూడా ఉప ఎన్నిక తీసుకురావాలన్నది కాంగ్రెస్ ప్లాన్‌గా చెబుతున్నారు. దీనిని అడ్డుకునేందుకు బీఆర్ ఎస్ నాయకులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా.. తను వివరణ ఇచ్చేందుకు ఆరు వారాలు గడువు ఇవ్వాలంటూ..పాడి కోరి మశీదు వారాలైంది. దీంతో మరో రెండు వారాల్లోనే ఆయనపై నిర్ణయం వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది

# యువత సృజనాత్మకతకు బతుకమ్మ ఛాలెంజ్ వేదిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించగలరని సమావేశంలో పేర్కొన్నారు. ఇన్ఫ్లుయెన్సర్ల విభాగంలో తెలంగాణ ప్రభుత్వ పథకాలు, ప్రజా పాలనపై రీల్స్, డిజిటల్ స్టోరీటెల్లింగ్ ద్వారా కంటెంట్ రూపొందించేందుకు అవకాశం కల్పించారు. యువ ఫిల్మ్ మేకర్లు, ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. మామిడి హరికృష్ణ, సినీ నటుడు రచ్చ రవి, అనిల్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు భరోసా! వరాల జల్లు !!

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఇప్పటి వరకు 1,30,000 మంది విద్యార్థులకు ?450 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం ఏ నెలకు ఆ నెల ఖచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు.

### 60 కోట్లతో 'కాటమయ్య రక్షణ కవచాలు'

గీత కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన 'కాటమయ్య రక్షణ కవచాలు' పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు కాగా, ఇప్పటికే 40 వేల కిట్లను అందించినట్లు వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా శిక్షణ పూర్తయ్యాక కాటమయ్య రక్షణ కవచం కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ పథకం కోసం మొత్తం ?60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు.

### నవంబర్‌లో 'రాజీవ్ యువ వికాసం'

రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉన్నతి కల్పించే లక్ష్యంతో రూపొందించిన 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను సూచించారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద మొదటి, రెండవ విడతల (ఇన్‌స్టాల్‌మెంట్స్) రూపంలో 180 మంది విద్యార్థులకు ?18 కోట్ల 40 లక్షల నిధులను విడుదల చేశామని చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ అవకాశం కల్పించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

# భూ భారతితో భరోసా

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , హౌసింగ్ అంశాలపై సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి తన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్రంలో ధరణి చట్టం వలన ప్రజలకు కలిగిన అసౌర్యాలు, అవస్థలను రూపుమాపుతూ భూభారతి పోర్టల్ లో పేర్కొన్నవిధంగా భూధార్ కార్డులను అందించడమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు.

భూ భారతి కింద 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశలో సర్వేకు ఎంపిక చేయగా, రాష్ట్రంలో నక్షాలు అందుబాటులో లేని సుమారు 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేసే కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు.

భూ సర్వేను వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రభుత్వం పెద్ద ఎత్తునసమకూర్చిందని మంత్రి తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతో పాటు రెండో దశలోనూ అదనపు రోవర్లను సమకూర్చి, జిల్లాల వారీగా అవసరానికి అనుగుణంగా అందిస్తున్నామని చెప్పారు.

అలాగే వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సర్వేయర్లు ఎలాంటి రాజకీయ ప్రచారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.దశాబ్దాలుగా సాగులో ఉన్నప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల సమస్యలను కూడా గుర్తించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల్లోని లోపాలు, అబాది ఆస్తుల వివరాలు వంటి గ్రామీణ ప్రాంత సమస్యలకు సమగ్ర సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రికార్డులు, మ్యాపులను ఆధునీకరించడం భూ భారతి లక్ష్యమన్నారు.

గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తులపై గతంలో విస్తీర్ణానికి సంబంధించిన స్పష్టమైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇకపై సర్వే ద్వారా ఆ ఆస్తి ఎన్ని గజాల్లో ఉంది, దాని హద్దులు ఎక్కడున్నాయి అనే వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరుస్తామని తెలిపారు. భూ భారతి చట్టం అబాది, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక రికార్డులు నిర్వహించడం, వాటి మూలలను జియో–కోఆర్డినేట్లతో మ్యాప్ చేయడం కోసం నిబంధనలు కలిగి ఉందని వివరించారు.

### ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలకు తావులేదు

భూ సమస్యల పరిష్కారంతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేయడంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను కూడా లక్ష్యబద్ధంగా పూర్తి చేస్తామని చెప్పారు. రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. "ఊరు గుడిసె లేని రాష్ట్రం" చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్థిక పరిస్థితులు ఎన్ని సవాళ్లు ఎదురైనా మూడో విడత, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

## 4 ఏళ్లు చదివితేనే
# లోకల్ రిజర్వేషన్

(మొదటి పేజీ తరువాయి)

మరోసారి సమర్థిస్తూ సోమవారం తీర్పు వెలువరించింది.

లోకల్ రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి నిబంధనను సవాల్ చేస్తూ జెల్ల అంకిత పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిబంధన ఏకపక్షంగా ఉందన్న వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే లోకల్ రిజర్వేషన్ వర్తిస్తుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.స్థానిక కోటా వర్తించాలంటే విద్యార్థులు 9, 10, 11, 12 తరగతులు (ఇంటర్ వరకు) వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలోనే చదివి ఉండాలి. ఉద్యోగ రీత్యా బదిలీలు అయ్యే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ రంగానికి చెందిన వారి పిల్లలకు నిబంధనల్లో తగిన మినహాయింపులు వర్తిస్తాయని కోర్టు తెలిపింది.




# ఖైరతాబాద్ ఖాళీ!

(మొదటి పేజీ తరువాయి)

సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థిపై గెలుపొందారు.అయితే, ఇటీవల దానం నాగేందర్ అనర్హత వేటుకు గురికావడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరుగుతున్నాయి.. ఖైరతాబాద్ నియోజక వర్గంలో దానం నాగేందర్ కు గట్టి పట్టుంది. కాంగ్రెస్ నుంచి ఒకసారి, బీఆర్ఎస్ నుంచి రెండుసార్లు ఇక్కడి నుంచి గెలిచారు. ఆయన వ్యక్తిగత బలం కొంత తోడయ్యే అవకాశముంది. అధికార కాంగ్రెస్ నుంచి దానం నాగేందర్ పోటీ చేసే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఒకింత కొంత అడ్వాంటేజీ అని అంటున్నారు. హైదరాబాద్ నగరంలో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలిచింది. కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడంతో ఖైరతాబాద్ లోనూ తమదే గెలుపు అన్న ధీమాలో ఉంది. మరొకవైపు బీఆర్ఎస్ రెండుసార్లు వరసగా ఖైరతాబాద్ లో గెలిచింది. అభ్యర్థి దానం నాగేందర్ అయినా 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడంతో కారు పార్టీ గెలుపుపై ధీమా కనపరుస్తుంది. మరొకవైపు 2014లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి చింతల రామచంద్రారెడ్డి గెలవడంతో తాము కూడా రేసులో ఉన్నామని భావిస్తున్నారు. ఇలా మశీదు పార్టీలూ ఎవరికి వారే ధీమాలో ఉన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు సంబంధించి ఎన్నికల సంఘం ఇంకా షెడ్యూల్ విడుదల చేయనందున మరియు ఎన్నికలు జరగనందున, గెలుపు ఎవరిదనేది ప్రస్తుతం చెప్పలేక పోయినా ఎడ్జ్ మాత్రం కాంగ్రెస్ కే ఉంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. . దానం నాగేందర్ అనర్హత వేటును సమర్థించడంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక మాత్రం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయ పార్టీల నేతలు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీజేపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు తమ పార్టీ వైపే మొగ్గు చూపుతారని పేర్కొన్నారు సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దానం నాగేందర్ స్పందిస్తూ, ఖైరతాబాద్ తనకు వ్యక్తిగతంగా బలమైన ప్రాంతమని, రాబోయే ఎన్నికల్లోనూ గెలుపు తనదేనని విశ్వాసం వ్యక్తం చేశారు. . ఈ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బీఆరఎస్, కాంగ్రెస్ పార్టీలు కూడా ప్రత్యేక వ్యూహాలతో సన్నాహాలు ప్రారంభిస్తున్నాయి. మరి చివరకు ఖైరతాబాద్ ప్రజలు ఎటువైపు నిలుస్తారన్నది చూడాలి. ఎన్నికల షెడ్యూల్ వెలువడి, అభ్యర్థులు ఖరారైన తర్వాతే అసలైన పోటీ మరియు గెలుపు సమీకరణాలు స్పష్టమవుతాయి.

# టీజీపీఎస్సీ పరీక్షల షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్–II) పోస్టుల భర్తీకి అక్టోబర్ 24న పరీక్ష జరుగనుంది. ఈ పోస్టుకు సంబంధించిన నియామక నోటిఫికేషన్‌ను ఏప్రిల్ 20న కమిషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

### 26న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలోనే అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి అక్టోబర్ 26న పరీక్ష జరగనుంది. ఈ పోస్టుకు సంబంధించిన నోటిఫికేషన్ జూన్ 2న వెలువడింది. అలాగే, రోడ్లు, భవనాల శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) పోస్టుల భర్తీకి నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు నిర్వహించ నున్నారు. ఈ పోస్టుకు సంబంధించి జూన్ 2న నోటిఫికేషన్ జారీ చేసింది. పాఠశాల విద్యాశాఖలోని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్/గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్–I పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. ఈ పోస్టుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మే 6న విడుదలైంది. నాలుగు నియామక పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ తెలిపింది. అభ్యర్థులు పరీక్షల తేదీలను గమనించి అందుకు అనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించింది.

# ప్రతి పేదింటికి సన్న బియ్యం

(మొదటి పేజీ తరువాయి)

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి విడుదలపై మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం నాగార్జున సాగర్ ఆయకట్టు కింద వేసిన పంటలు కాపాడడంతో పాటు, వచ్చే వేసవి ఆపై వరకు ప్రజలకు తాగునీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మిర్యాలగూడ నియోజక వర్గంలో 878 కోట్ల రూపాయలతో 6 లిఫ్ట్ ఇరిగేషన్లకు శంకుస్థాపనలు చేయగా, తాము అధికారంలోకి వచ్చాక 175 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఆ పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. మిర్యాలగూడ నియోజక వర్గంలో చేపట్టిన 6 లిఫ్ట్ ఇరిగేషన్ లను తమ హయాంలోనే పూర్తి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని దున్నపోతుల గండి, బత్తలపాలెం, కేశవాపురం,






వీర్లపాలెం, నెల్లికల్ తదితర ఎత్తిపోతల పథకాలకు నిధులు విడుదల చేశామని ,ఈ హయాంలోనే వాటిని పూర్తి చేస్తామని, బ్రాహ్మణ వెల్లేముల , ఉదయ సముద్రం, ఐటిపాములలను తమ హాయంలోనే పూర్తి చేస్తామని తెలిపారు. జూన్ 2028 నాటికి ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులను పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 3,50,000 ఎకరాలకు సాగునీరందిస్తామని తెలిపారు. అలాగే నక్కలగండి, డిండి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు.

మిర్యాలగూడ నియోజక వర్గంలో అర్హత ఉన్న ప్రతి గ్రామానికి చౌక ధర దుకాణం మంజూరు చేస్తామని, నియోజక వర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేస్తామని ,అలాగే మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్ కు సంబంధించిన ఫైలు క్లియర్ చేస్తామని, మిర్యాలగూడ బస్టాండ్ ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కానీ తాము అధికారంలోకి వచ్చాక స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఎల్ నినో ప్రభావం వల్ల నాగార్జున సాగర్ నుండి సాగునీటిని విడుదల చేయడం లేదని, ప్రస్తుతం ఉన్న పంటలు కాపాడడంతో పాటు, చెరువులను నింపడం, హైదరాబాద్ వరకు తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని, తమ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని, నియోజక వర్గంలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని, రైతులకు సాగునీరందించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు .

మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, పేదలందరికీ సన్నబియనిస్తున్నామని, మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నదని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తి చేయాలని, అర్హత ఉన్న ప్రతి గ్రామానికి చౌకధర దుకాణం మంజూరు చేయాలని, మిర్యాలగూడ లో ఎన్ఎస్పి స్థలంలో తహసిల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నిధులు కేటాయించాలని, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాలని, డిఎంఎఫ్ టి , సిఎస్ఆర్ నిధుల ద్వారా అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా, రేషన్ కార్డులలో కొత్తవారిని చేర్చడం జరిగిందని, ప్రతి రేషన్ కార్డుదారుకు సన్న బియ్యం ఇవ్వడం జరుగుతున్నదని, స్మార్ట్ రేషన్ కార్డు వల్ల బియ్యం తీసుకున్నది లేనిది తెలుసుకునే వివరాలతో పాటు, పూర్తి వివరాలను ట్రాక్ చేసే అవకాశం ఉందని అన్నారు.మిర్యాలగూడ నియోజకవర్గంలో సుమారు మూడు లక్షల జనాభా లో లక్ష 1688 స్మార్ట్ రేషన్ కార్డులివ్వడమే కాకుండా, 11 కోట్ల రూపాయల సబ్సిడీతో సన్నబియ్యం ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ ఛైర్మన్ సుధ మాట్లాడారు. మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, పౌరసరఫరాల డిఎం రాంపతి నాయక్, డిఎస్ఓ వెంకటేష్, స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్ ,మున్సిపల్ కమిషనర్,నియోజకవర్గంలోని తహసిల్దారులు, తదితరులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

# రీ చార్జీలకు 30 రోజుల వ్యాలిడిటీ

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఈ కొత్త నిబంధనల ద్వారా వినియోగ దారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.గతంలో నెలవారీ రీఛార్జ్ పేరుతో వినియోగదారులు ఏడాదికి 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై ఆ సమస్య ఉండదని రాఘవ్ చద్దా తెలిపారు. ట్రాయ్ కొత్త నిబంధనలతో 30 రోజుల రీఛార్జ్ ప్లాన్‌లు అందుబాటులోకి రావడంతో, ఇకపై వినియోగదారులు సంవత్సరానికి 13 సార్లు కాకుండా కేవలం 12 సార్లు మాత్రమే రీఛార్జ్ చేసుకోవచ్చని స్పష్టం చేశారు.ఇంటర్నెట్ లేదా డేటా అవసరం లేకుండా కేవలం కాల్స్ మాత్రమే కోరుకునే కస్టమర్ల కోసం ప్రత్యేకంగా వాయిస్ ఓన్లీ ప్లాన్‌లను ప్రవేశపెట్టాలని ట్రాయ్‌ని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ ప్లాన్లలో ఇన్‌కమింగ్ అవుట్‌గోయింగ్ సేవలు రెండూ అందుబాటులో ఉంటాయని, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు, బడ్జెట్‌లో ఉండే మొబైల్ యజర్లకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.పరిమితమైన రీఛార్జ్ ఎంపికలపై ప్రజల నుంచి వచ్చిన ఆందోళనలను తాను మార్చి 11న పార్లమెంట్‌లో లేవనెత్తానని రాఘవ్ చద్దా తెలిపారు. ప్రజల డిమాండ్లను నెరవేర్చిన కేంద్ర ప్రభుత్వానికి, ట్రాయ్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్మాణాత్మక రాజకీయాలకు ఇదొక గొప్ప నిదర్శనమని ఆయన అన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించే వరకు పోరాటం ఆగదు

**కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది**

**తెలంగాణలో 30 శాతం ఓట్లు గల్లంతు అయ్యే చాన్స్ ఉంది**

**సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన మహా ధర్నాలో పాల్గొన్న మంత్రి,**

సూర్యాపేట , అక్షిత బ్యూరో :

కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన ఓటర్ల జాబితా సవరణ(సర్) ప్రక్రియలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు,అక్రమ మార్పులకు పాల్పడినందున అందుకు అతన్ని వెంటనే విధుల నుండి తొలగించాలని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.అందుకు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధి నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.70 ఏళ్ల దేశ స్వతంత్ర సముపార్జనలో సంపూర్ణ ప్రజాస్వామ్యం కొనసాగుతూ వస్తోందని,అట్టి ప్రజాస్వామ్యాన్ని నేడు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖూనీ చేస్తోందని ఆరోపించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు తెచ్చుకున్న మన భారతదేశంలో నేడు సర్ ప్రక్రియ పేరుతో కోట్ల సంఖ్యలో ఓట్లను తొలగించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని వెల్లడించారు.బీజేపీ ప్రభుత్వానికి తొత్తుగా మారిన సీఈసీని విధులు నుండి తొలగించి,అరెస్ట్ చేసే వరకు తమ పోరాటం ఆగదని,ఇది




కేవలం ఆరంభం మాత్రమేనని హెచ్చరించారు.ఈసీ నిర్వాకం వల్ల తెలంగాణలో సైతం 30 శాతం ఓట్లు గల్లంతు అయ్యే అవకాశం ఉందన్నారు.ఈ ప్రభావం బడుగు,బలహీన వర్గాలపైనే అధికంగా పడనుందని తేల్చి చెప్పారు. రాబోయే ఎన్నికల్లో నిస్సందేహంగా రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని 140 కోట్ల మంది జనం ఎదురు చూస్తున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కి వినతి పత్రాన్ని అందజేశారు. సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నాలో తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్,ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, తెలంగాణ వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్,పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్ రావు,పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న,జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీ నారాయణరెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు కొత్త బస్ స్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన భారీ నిరసన ర్యాలీ పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్లకార్డులతో కేంద్ర ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

## బీజేవైఎం ఐటీ సెల్ ఇంచార్జిగా మచ్చ వివాకర్ రెడ్డి

**నూనెగూడం గ్రామానికి చెందిన మచ్చ వివాకర్ రెడ్డిని బీజేవైఎం ఐటీ సెల్ ఇంచార్జి నియమిస్తూ పార్టీ బాధ్యతలు అప్పగింపు**



**యాదాద్రి భువనగిరి అక్షిత ప్రతినిధి:** బీజేవైఎం ఐటీ సెల్ ఇంచార్జిగా యాదాద్రి భువనగిరి జిల్లా, గుండాల మండలం నూనెగూడం గ్రామానికి చెందిన మచ్చ వివాకర్ రెడ్డిని బాధ్యతలకు నియమించారు. యువతను పార్టీ కార్యక్రమాలతో అనుసంధానం చేయడంతో పాటు సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఐటీ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మచ్చ వివాకర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. యువతను చైతన్యవంతం చేస్తూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

## మరణించిన గ్రామపంచాయతీ కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

**గొర్ల నాగరాజు కుటుంబానికి CITU ఆర్థిక సహాయం**

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** అనారోగ్యంతో మృతి చెందిన రామన్నపేట గ్రామపంచాయతీ కార్మికుడు గొర్ల నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రామన్నపేట మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. నాగరాజు దశదినకర్మ సందర్భంగా తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్




యూనియన్ రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో జ×ఖ రామన్నపేట మండల కమిటీ తరపున రూ.9 వేల ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, నాగరాజు అనారోగ్యంతో బాధపడుతూ సరైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్థోమత లేక మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబం ప్రస్తుతం కనీసం సొంత ఇల్లు కూడా లేని పరిస్థితిలో ఉందని, భార్యతో పాటు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే నాగరాజు కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఆయన భార్యకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు లేకపోవడం, సరైన ఇన్సూరెన్స్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం తదితర ముఖ్యమైన సేవలు అందిస్తున్న కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి గ్రామపంచాయతీ కార్మికుడికి కనీస వేతనం, మెరుగైన వైద్య సదుపాయాలు, జీవిత బీమా వంటి భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.మరణించిన కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక సహాయం అందించి, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్ర మంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్య దర్శి నకరికంటి రాము, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మండల అధ్య క్షులు గాదె ఎల్లయ్య, ముత్యాల సాయిలు, స్వామి, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి చెస్ పోటీలో ద్వితీయ స్థానం

**కరీంనగర్,అక్షిత బ్యూరో:** క్రీడలు సమాజంలో చాలా కీలకంగా వ్యవహరిస్తాయని మరియు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చాలా ఉపయోగపడతాయి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు మరియు విద్యార్థిని సన్మానించారు



"అల్ఫోర్స్ లో విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు నిర్వహణ"

చెస్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని మరియు చెస్ ఆడడం ద్వారా విద్యార్థులకు సృజనాత్మకతతో పాటు చక్కటి ఆలోచన విధానం పెరుగుతుందని తద్వారా ఇతరుల కంటే పై చేయి సాధించవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలకు చెందినటువంటి విద్యార్థికి రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ద్వితీయ స్థానం రావడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రధానంగా వారికి ఎదురైనటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించడమే కాకుండా ఇతరులతో సత్సంబంధాలు పెంపొందించ డానికి ప్రధానంగా సోదరభావాన్ని వ్యాప్తి చేయడానికి క్రీడలు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్లోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఈనెల 18 నుండి 20 వరకు వారు నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి జి.శివాస్, 8వ తరగతి, అండర్ - 15 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానంతో పాటు రజత పతకాన్ని గెల్చుకున్నాడని హర్షం వ్యక్తం చేస్తూ విజేతకు పుష్పగుచ్చాన్ని అందజేసి భవిష్యత్తులోనూ ఇదే విజయం పరంపరకు కొనసాగించాలని ఆకాంక్షించారు

ఈ.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:**



తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఎన్నికలో చౌటుప్పల్ గురుకుల విద్యాలయం పూర్వ ప్రిన్సిపల్ కే. వెంకట నరసయ్య కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

ఉపాధ్యక్షుడిగా డి.సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కే సుబ్బారావు, సంయుక్త కార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా వీ తిరుపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్ రెడ్డి, వెంకటాచారి, కెవిఎన్ ఆచార్య, కే నాగేశ్వరరావు, చంద్రకళ, అంజన్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా కే. రవి చందర్, పి. శ్యాంసుందర్ ఎన్నికైనట్లు కమిటీ అధ్యక్షుడు కే వెంకట నరసయ్య తెలిపారు.

## దేశం నాకేమిచ్చిందని కాదు,దేశానికి నేనేమి ఇవ్వగలనని ఆలోచించాలి

**భగత్ సింగ్ త్యాగాలు, ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం : మేయర్ కొలగాని శ్రీనివాస్**




**కరీంనగర్ అక్షిత బ్యూరో:**

"ఈ దేశం నాకేమిచ్చింది అనేది కాదు.. ఈ దేశానికి నేనేమి ఇవ్వగలను అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి" అని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.

"నా దేశం, నా జాతి, నా బాధ్యత" అనే నినాదంతో, స్వామి వివేకానంద చికాగో సందేశ ప్రచార కార్యక్రమంలో భాగంగా నేషనల్ యూత్ ప్రాజెక్ట్ , నీఫా, తెలంగాణ గాంధీ స్మారక నిధి, హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కే. యాదవ రాజు, రాష్ట్ర నీఫా కన్వీనర్ ఎం.డి. తాహిర్ పాషా, నీఫా, ఎన్వైపీ కార్యకర్తలు, డివిజన్ పెద్దలు పాల్గొని భగత్ సింగ్కు ఘన నివాళులర్పించారు. "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదాలతో ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే జలియన్వాలాబాగ్ దురంతం భగత్ సింగ్పై తీవ్ర ప్రభావం చూపిందని, దేశానికి స్వాతంత్ర్యం సాధించాలనే సంకల్పంతో ఆయన తన జీవితాన్ని దేశ సేవకు అంకితం చేశారని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో భారత ప్రజలు ఎదుర్కొన్న అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక పరిస్థితులను చూసి చలించిపోయిన భగత్ సింగ్, దేశ స్వాతంత్ర్యం కోసం యువతను చైతన్యపరిచి ఉద్యమంలో భాగస్వాములను చేశారని అన్నారు.

భగత్ సింగ్తో పాటు రాజ్గురు, సుఖ్దేవ్లు దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం, చూపిన ధైర్యసాహసాలు, చేసిన ప్రాణత్యాగం ప్రతి భారతీయుడికి చిరస్మరణీయమని మేయర్ అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా యువతలో విప్లవ స్ఫూర్తిని నింపిన భగత్ సింగ్, దేశం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదని గుర్తుచేశారు. ఆయన సహచరులతో కలిసి చేసిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు.నేటి యువత భగత్ సింగ్ జీవితాన్ని, ఆయన దేశభక్తిని, నిర్భయత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు.

దేశభక్తి అంటే కేవలం నినాదాలకే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం, ప్రజాసేవలో భాగస్వాములు కావడం, సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతలు, మూఢనమ్మకాలు, రుగ్మతలను తొలగించేందుకు కృషి చేయడమని అన్నారు.

మహనీయుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. ప్రతి యువకుడు తన వంతు బాధ్యతగా దేశాభివృద్ధికి, సమాజ సంక్షేమానికి కృషి చేయాలని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ మంచి పౌరులుగా ఎదగాలని మేయర్ ఆకాంక్షించారు.

## రోడ్ల పనుల్లో టైం బాండ్.. అభివృద్ధిలో రాజీ లేదు..

**5వ డివిజన్ రెడ్డి కాలనీలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన...**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లో అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, నిర్ణీత గడువులో పూర్తి చేయిస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 5వ డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిరోజూ రెండు డివిజన్లలో రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేస్తూ, ప్రారంభించిన పనులకు కాంట్రాక్టర్లు, అధికారులకు స్పష్టమైన టైం బాండ్ విధిస్తున్నామని తెలిపారు. నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. మిగిలిన రోడ్ల పనుల్లో కొంత భాగాన్ని ప్రస్తుతం తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వరంగల్ నగరంలో భారీ



స్థాయిలో అండర్గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఇప్పుడు కొత్త రోడ్లు వేసి, కొద్ది కాలానికే డ్రైనేజీ, వాటర్ పైప్లైన్ల కోసం వాటిని మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి రాకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

## పేద కుటుంబానికి అండగా బండారి లక్ష్మారెడ్డి

**బ్రెయిన్ ట్యూమర్ బాధితుడికి అత్యవసర వైద్యం అందించాలని నిమ్స్ డైరెక్టర్కు సూచన..**

**ఎల్వోసీ ద్వారా వైద్య ఖర్చుల భరోసా**



**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, సెప్టెంబర్ 28:** ఆపదలో ఉన్న పేద కుటుంబానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అండగా నిలిచారు. చిలకనగర్ డివిజన్కు చెందిన పొన్నబోయిన సుధాకర్ తమ్ముడు పొన్నబోయిన లక్ష్మణ్ గత కొంతకాలంగా తీవ్రమైన బ్రెయిన్ ట్యూమర్ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితి గురించి చిలకనగర్ డివిజన్కు చెందిన గుడి మధుసూదన్ రెడ్డి ద్వారా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వెంటనే స్పందించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన ఎమ్మెల్యే, నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్తో నేరుగా మాట్లాడి లక్ష్మణ్కు తక్షణమే అత్యవసర వైద్యం అందించాలని సూచించారు. రోగి చికిత్స విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అదే సమయంలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల విషయంలో కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా అందే ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)తో పాటు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పేద కుటుంబానికి అండగా నిలిచి, అత్యవసర సమయంలో చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

లక్ష్మణ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ఎమ్మెల్యే స్వయంగా ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. కష్ట సమయంలో స్పందించి వైద్య చికిత్స కోసం భరోసా కల్పించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో తమకు కొంత ధైర్యం కలిగిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి రీల్ మేకింగ్ పోటీలో రామన్నపేట డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్న విద్యార్థులు**



**రామన్నపేట,అక్షిత ప్రతినిధి:**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన రీల్ మేకింగ్ పోటీలలో రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. కళాశాలలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పి. భానుశ్రీ, బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వి. చందు రీల్ మేకింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో బహుమతులకు ఎంపికయ్యారు. హైదరాబాద్లోని శిల్పకళారామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖాన్ విద్యార్థులను అభినందిస్తూ, తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి పర్యాటక శాఖ మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం కళాశాలకు మాత్రమే కాకుండా జిల్లాకే గర్వకారణమని అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు కళాశాల తరపున మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. కళాశాల యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కిషన్ మాట్లాడుతూ, రీల్ మేకింగ్ పోటీలో కళాశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అనంతరం రాష్ట్రస్థాయి పోటీలో కూడా అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి బహుమతులు సాధించారని తెలిపారు. పర్యాటక ప్రదేశాలు, తెలంగాణ సంస్కృతి, వారసత్వ సంపదపై విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు వారి సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలో బహుమతులు సాధించిన పి. భానుశ్రీ, వి. చందులను కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు వివిధ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని కళాశాలకు, జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## హామీలు నెరవేర్చాలి.. ఆటో కార్మికుల నిరసన

**సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు ఉత్త చేతులతో రావద్దు**

**ఒక్కో ఆటో కార్మికుడికి బాకీ పడ్డ రూ.34 వేల చెల్లించాలని డిమాండ్**




**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్న చౌక్ వద్ద నేతన్న విగ్రహం సమీపంలో ఆటో కార్మికులు ప్లకార్డులు, ఫ్లెక్సీలతో ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఒక్కో ఆటో కార్మికుడికి బాకీ పడ్డ రూ.34 వేల ఆర్థిక సహాయాన్ని చెల్లించాలని నినాదాలు చేశారు.

ఈనెల 30న సిరిసిల్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో, ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే సిరిసిల్లకు రావాలని ఆటో కార్మికులు కోరారు. "ఉత్త చేతులతో రావద్దు.. ఇచ్చిన హామీలు నెరవేర్చాలి" అంటూ నినాదాలు చేశారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, ఆటో కార్మికుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (భూసేకరణ) శాఖ

**ఫారం - 7**

(చట్టం-30/2013లోని సెక్షన్ 19(1)లోని సబ్ రూల్-(1) రూల్ 25 ప్రకారం)

**రూఢీ ప్రకటన**

G1/4027/2026 తేది : 23.09.2026
ఫైల్ నెం. సి/50/2024 తేది : 18.09.2026

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, కట్టంగూర్ మండలం ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో భూమి విస్తీర్ణం ఎ.9.27½ గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం ఉదయసముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో భాగంగా కుడి ప్రధాన కాలువ యొక్క డి-2 యందు కి.మీ. 12.608 నుండి కి.మీ. 13.266 వరకు మరియు కి.మీ. 13.304 నుండి కి.మీ.15.732 వరకు కాలువ కోసం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద నల్లగొండ జిల్లా, కట్టంగూర్ మండలం ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో విస్తీర్ణం ఎ.9.27½ గు.లు భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీచేయనైనది.

**షెడ్యూల్**

గ్రామం : ఇస్మాయిల్‌పల్లి మండలం : కట్టంగూర్ జిల్లా : నల్లగొండ

| క్రమ సంఖ్య | సర్వే నెం. భూమి స్వభావం ఖుష్కి/తరి/పట్టా /ప్రభుత్వ విస్తీర్ణం | భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ.గుం. | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి / భర్త పేరు | ప్రదేశము పై ఉన్న చెట్లు/నిర్మాణములో ఉన్న ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | 137 పట్టా/తరి 2.01 | 0.20 | బల్ల బాలరాజు తండ్రి రమణ | -- |
| 2 | | 0.21 | బల్ల జులేనయ్య తండ్రి జోజయ్య | -- |
| 3 | | 0.20 | బల్ల రాయన్న తండ్రి జోజయ్య | -- |
| 4 | | 0.20 | బిజేమొయిజ్ చౌధరి తండ్రి జోజయ్య | -- |
| 5 | 140 పట్టా/తరి 0.24½ | 0.24 ½ | మెరెడ్డి అశోక్ రెడ్డి తండ్రి భగవంత రెడ్డి | 1 తాటిచెట్టు, 2వేప చెట్లు, రాతికడీల ఫెన్సింగ్, 2బోర్లు పైప్‌లైన్ |
| 6 | 141 పట్టా/తరి 1.01 | 0.21 | బురుగు అభిలాష్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | 3 బోర్లు, పైప్ లైన్ మరియు ఫెన్సింగ్ |
| 7 | | 0.20 | చెరుకుయాదయ్య తండ్రి లింగయ్య | 2వేప, 5తాటిచెట్లు |
| 8 | 143 పట్టా/తరి 0.03 | 0.03 | బొబ్బలి సావిత్రమ్మ భర్త వేణుగోపాల్ రెడ్డి | -- |
| 9 | 146 పట్టా/తరి 0.21 | 0.21 | ముడిపల్లి అంజయ్య తండ్రి పాపయ్య | -- |
| 10 | 147 పట్టా/తరి 0.04 | 0.04 | ముడిపల్లి నర్సింహా తండ్రి పాపయ్య | -- |
| 11 | 149 పట్టా/తరి 0.35 | 0.35 | అన్యాలపు భార్గవి భర్త నరేష్ అన్యాలపు నరేష్ తండ్రి నర్సింహా | రైస్‌మిల్,1 గుడి 2 జామ, 1ఎర్రచందనం,1 కొబ్బరి,1సపోటా 3బోర్లు &పైప్‌లైన్ కల్లం(వడ్లు ఆరబెట్టు ఫ్లోర్) 36కడీలు 2టేకు 1 వేప, 1మారేడు, 3మామిడి, 2 సీతాఫలం మరియు ట్రాన్స్‌ఫార్మర్ |
| 12 | 150 పట్టా/తరి 0.18 | 0.18 | అలుగుబెల్లి విజయమ్మ భర్త రుద్ర రెడ్డి | 1 గుడి,1 బోరు, పైప్‌లైన్, ఫెన్సింగ్ |
| 13 | 153/పట్టా /ఖుష్కి/తరి 1.06 | 0.16 | అలుగుబెల్లి విజయమ్మ భర్త రుద్ర రెడ్డి | 1 బోరు, పైప్‌లైన్, ఫెన్సింగ్ |
| 14 | | 0.30 | బొర్రా సుమన్ తండ్రి సుధాకర్ | 14 టేకుచెట్లు,రాతి కడీలాఫెన్సింగ్,1వేప 2 తాటిచెట్లు, 2 బోర్లు, పైప్‌లైన్ |
| 15 | 179/పట్టా /ఖుష్కి/తరి 2.06 | 1.10 | గులాబ్ చంద్ తండ్రి కేశవ లాల్ | 1 బోరు బావి 20 సపోటాచెట్లు & 15 టేకు చెట్లు |
| 16 | | 0.10 | నంధ్యాల రామ్‌రెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి | ఉమ్మడి 1 బోరు పైప్‌లైన్, ఫెన్సింగ్ |
| 17 | | 0.10 | నంధ్యాల మల్లారెడ్డి తండ్రి గోపాల్‌రెడ్డి | -- |
| 18 | | 0.08<br>0.08 | నంధ్యాల మల్లారెడ్డి తండ్రి రామచంద్ర రెడ్డి<br>నంధ్యాల పారిజాత భర్త రామ్‌రెడ్డి | ఉమ్మడి 1 బోరు పైప్‌లైన్, ఫెన్సింగ్ |
| 19 | 181 పట్టా/ఖుష్కి 0.12 | 0.12 | పోలీస్ బెటాలియన్ కమాండర్ | |
| 20 | 184 పట్టా/తరి 0.16 | 0.04 | రేకల ప్రవీణ్ తండ్రి గోపాల్ | 2 బోర్లు, పైప్‌లైన్, ఫెన్సింగ్ |
| 21 | | 0.04 | రేకల గోపాల్ తండ్రి మారయ్య | 1షెడ్డు,1బోరు,పైప్ లైన్, ఫెన్సింగ్ |
| 22 | | 0.04 | రేకల యాదయ్య తండ్రి మారయ్య | 1 బోరు, పైప్‌లైన్ |
| 23 | | 0.04 | రేకల రామలింగయ్య తండ్రి నారయ్య | -- |
| | మొత్తం | 9.27½ | | |

ప్రతిపాదిత భూమి భూసేకరణ చట్టము, 2013 నెం. 30/2013లోని సెక్షన్ 15 ప్రకారం సంబంధిత భూ యజమానుల నుండి ముసాయిదా నోటిఫికేషన్ పై ప్రతిపాదిత భూసేకరణ విషయములో అభ్యంతరముల స్వీకరణ మరియు తగిన విచారణ తదుపరి సెక్షన్ 19/1 ప్రకారం డిక్లరేషన్ జారీ చేయనైనది. ఇట్టి భూసేకరణ వలన ఎవరు ప్రభావితము కాలేదు. నిర్వాసితులు కాలేదు. కావున సెక్షన్ 31 (కేంద్ర చట్టము 30/2013) క్రింద విడిగా ఆర్ అండ్ ఆర్ అవార్డు జారీ చేయవలసిన అవసరం లేదు.

ప్రతిపాదిత భూసేకరణ తల పెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పై విషయములో తెలపబడిన భూసేకరణ చేయబడు భూమి యొక్క ప్లాన్ ఏదేని పని దినములలో మరియు కార్యాలయము పని వేళలలో ప్రత్యేక ఉప కలెక్టర్, యూనిట్-2, నల్లగొండ కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/-.ప్రత్యేక ఉప కలెక్టర్, ఆర్ & ఆర్ & ఎల్.ఏ. విభాగము-2, నల్లగొండ
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్లగొండ
సం/-. జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO.NO:918/LA/PP/Advt/Pub/2026-27



## ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలి

**ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా**

**కేంద్రం తీరుపై విరుచుకుపడ్డ ఎమ్మెల్యేలు యెన్నం, జి.మధుసూదన్ రెడ్డి**

మహబూబ్ నగర్,అక్షిత న్యూస్: దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు, డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున మహాధర్నా నిర్వహించాయి. ఈ నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకురావడం రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిపై తీవ్ర సందేహాలను కలిగిస్తోందని మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన నిష్పక్షపాత ఎంపిక కమిటీ ఏర్పాటవగా, అనంతరం పార్లమెంటు చట్టం ద్వారా న్యాయవ్యవస్థ ప్రాతినిధ్యాన్ని తొలగించి తమకు అనుకూలంగా మార్పులు చేశారని ఆరోపించారు. పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న కాలంలో టీ.ఎన్. శేషన్ వంటి ప్రధాన ఎన్నికల కమిషనర్లు నిర్భయంగా వ్యవహరించి విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారని ఆయన గుర్తుచేశారు. దేశ యువత ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగాలని ఆశిస్తుంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘాన్ని తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని విమర్శించారు. ఓటర్ల జాబితా




రూపకల్పన, నిర్వహణలో పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు.

అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ, తమకు నచ్చిన వ్యక్తులకు కీలక పదవులు అప్పగిస్తోందని ధ్వజమెత్తారు. కీలక రాజ్యాంగ, పరిపాలనా వ్యవస్థల్లో అనుకూల వ్యక్తులను చేర్చి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు లాంటి ఎన్నికల సంఘంపైనా రాజకీయ ప్రభావం చూపించే యత్నాలు చేయడం దారుణమన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టి పిసిసి అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, టి పిసిసి ప్రధాన కార్యదర్శి మిథున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నేతలు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, దోమ పరమేశ్వర్, రాములు యాదవ్, ఎస్సీ సెల్ చైర్మన్ పసుల రాజు, ఎస్టీ సెల్ లింగం నాయక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు

చౌటుప్పల్ /అక్షిత న్యూస్: చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మల్కాపురం, బొర్రోని గూడెం గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దివిస్ పరిశ్రమ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభారాణి, ఎస్.కె అక్బర్ లు ప్రారంభించగా డాక్టర్ జయంత్ కుమార్,డాక్టర్ నరేష్ లు విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించి



అవసరమైన విద్యార్థులకు ఉచితంగా మందులను ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం 2,23,650 రూపాయల విలువ గల 5,545 రాత పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యాసంస్థలకు దివిస్ పరిశ్రమ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు బి గోపి,జీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందితో రాజకీయ పనులు చేయించడం సరికాదు

**- ఎస్సీ సెల్ అధ్యక్షుడు బ్యాగరి మల్లేష్**

కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:

పెద్దకొత్తపల్లి: గ్రామపంచాయతీకి సిబ్బందిని రాజకీయ పార్టీ కార్యక్రమాలకు వినియోగించడంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బ్యాగరి మల్లేష్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గ్రామపంచాయతీ సిబ్బంది అధికారిక విధులు నిర్వహించాల్సి ఉండగా, బీఆర్ఎస్ పార్టీ దిమ్మెను శుభ్రం చేయడానికి కడగడానికి వారిని వినియోగించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదులో కోరినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సిబ్బందిని ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలు లేదా ఆస్తుల నిర్వహణ కోసం ఉపయోగించకుండా సంబంధిత అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలకు సేవ చేయడానికి ఉన్నారు. రాజకీయ పార్టీ కార్యకలాపాలకు వారిని ఉపయోగించడం సరికాదు.

ఈ అంశంపై అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలి అని బ్యాగరి మల్లేష్ కోరిరు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల నాయకులు ఎదురపల్లి మహేష్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ముచ్చపోతూ శంకర్, మేడిపూరీ స్వామి, కూర అశోక్ ,రమేష్ గౌడ్,శివ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.




## సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలి

**ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించేది లేదులి**

**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య,ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి**

కాజీపేట్, అక్షిత ప్రతినిధి :

ఏఐసీసీ ఆదేశాల మేరకు, కేంద్ర ఎన్నికల సంఘంలో సర్ లో జరిగిన "ఓటు చోరీ" అక్రమాలకు వ్యతిరేకంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ నిరసన కార్యక్రమంలో లివరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులకు పాల్పడిన సి ఈ సి జ్ఞానేశ్ కుమార్ ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే భారీ ర్యాలీతో హనుమకొండ కలెక్టరేట్ వరకు తరలివచ్చారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతు ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేశారు. 'ఓటు చోరీ'పై కాంగ్రెస్ పోరాటం ఇప్పటితో ఆగదని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. బీజేపీ



రాజకీయంగా వరంగల్‌లో అడుగుపెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా అడ్డుకోవాలని పిలుపునీచ్చరు.

గతంలో వరంగల్ అభివృద్ధికి బీజేపీ చేసిందేమీ లేదని ఎంపీ విమర్శించారు. మామునూరు విమానాశ్రయం, ఓఆర్‌ఆర్, కోచ్ ఫ్యాక్టరీ వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం పోరాడుతోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రులను కలిసి వరంగల్ అభివృద్ధి అంశాలను ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.

మతం, కులం పేరుతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణలో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో ఘనంగా 'శాతవాహన గ్రామీణ సంత' ప్రారంభం

**స్వదేశీ ఉత్పత్తులు, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 40 స్టాల్స్‌తో ఏర్పాటు**

కరీంనగర్, అక్షిత బ్యూరో:

స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ , ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సోమవారం కరీంనగర్ పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో 'శాతవాహన గ్రామీణ సంత' ఘనంగా ప్రారంభమైంది. గ్రామ భారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గ్రామీణ సంత నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది.ఈ ప్రదర్శనలో వివిధ రకాల గ్రామీణ ఉత్పత్తులతో కూడిన మొత్తం 40 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. చేనేత వస్త్రాలు, సేంద్రియ (ఆర్గానిక్) ఆహార పదార్థాలు, మట్టి పాత్రలు, హస్తకళలు, మూలికా ఆరోగ్య ఉత్పత్తులు ఈ సంతలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇట్టి ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా, ప్రధాన వక్త గా హాజరైన జిల్లా సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విక్రమ్ సింగ్ ఠాకూర్ లు మాట్లాడుతూ దేశీయ ఉత్పత్తులను ఆదరించడం ద్వారా స్థానిక చేతివృత్తుల వారికి, గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు..నేటి ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో రసాయనాలకు దూరంగా ఉంటూ, ప్రకృతి సిద్ధమైన స్వదేశీ వస్తువులను వాడటం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం, పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ఇలాంటి పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఈ గ్రామీణ సంత కరీంనగర్ ప్రజలకు నూతన అనుభూతిని పంచుతుందని, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేసి గ్రామీణ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత గ్రామ వికాస్




సంయోజక్ జిన్నా సత్యనారాయణ రెడ్డి , సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ శంకరయ్య , గ్రామ భారతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ గాలి పెల్లి నాగేశ్వర్ , ప్రధాన కార్యదర్శి కూర్మాచలం మునిందర్ , ఉపాధ్యక్షులు క్యాస మధు , కార్యదర్శి గొల్లె తిరుపతి శివనాథుల స్వప్న , గ్రామ వికాస్ జిల్లా సంయోజక్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర ప్రభుత్వ తీరుపై సిరిసిల్లలో ధ్వజమెత్తిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు

రాజన్న సిరిసిల్ల, అక్షిత: కేంద్ర ప్రభుత్వ తీరు పై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు ధ్వజమెత్తారు. ఎన్నికల వ్యవస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తూ లక్షలాది ఓట్లను అక్రమంగా తొలగించారని వీహెచ్ ఆరోపించారు.ఈ నెల




30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటన నేపథ్యంలో సిరిసిల్లలో ఆయన బహిరంగ సభా స్థలాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్ ఐ ఆర్ -సర్ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్యాయంగా లక్షలాది ఓట్లను తొలగించారని విహెచ్ ఆరోపించారు.

కులగణన, బీసీ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకోవడం దారుణమని విమర్శించారు. ఓట్ల తొలగింపు, బీసీలకు రిజర్వేషన్ల అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో



ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ల హయాంలో రాజ్యాంగబద్ధ సంస్థలు నిష్పక్షపాతంగా పనిచేయాలని ప్రస్తుతం ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని వివరణ కోరేందుకు ప్రయత్నించినా.. అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టినట్లు గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపి అసెంబ్లీలో బిల్లు తీసుకొచ్చామని వీహెచ్ వివరించారు. కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని హనుమంతరావు స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టిబొమ్మను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు.

ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్.ఎస్.ఎఫ్ జాతీయ మహాసభను జయప్రదం చేయండి

**బోయ లింగస్వామి మాదిగ**

చౌటుప్పల్/ అక్షిత న్యూస్:



మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎంఎస్ఎఫ్ కమిటీల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా, వచ్చేనెల అక్టోబర్ 6 వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా జాతీయ సభ నిర్వహిస్తున్నట్టు ఎంఆర్పిఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి

బోయ లింగస్వామి మాదిగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని, విద్యార్థుల హక్కులు మరియు సామాజిక న్యాయం కోసం ఎంఎస్ఎఫ్ లో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ జాతీయ మహాసభకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందాం

**- ఎల్లంకి మహేష్**

వలిగొండ/ అక్షిత న్యూస్: వలిగొండ మండల కేంద్రంలో ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ 119 వ జయంతినీ పురస్కరించుకొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఏఐటియూసీ మండల అధ్యక్షులు కనకబోయిన ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది.ఏఐటియుసి మండల కార్యదర్శి




ఎల్లంకి మహేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్ సింగ్ ఈ దేశానికి సంపూర్ణమైన స్వాతంత్రం కావాలని, బ్రిటిష్ సామ్రాజ్యానీ వ్యతిరేకంగా పోరాడారని అతి చిన్న వయసులో ఉరికంబాన్ని ముద్దాడి తన తోపాటు రాజు గురు ,సుఖదేవ్ లు ప్రాణాలను ఇచ్చారని అన్నారు. వారి స్ఫూర్తితో నేటి సమాజమంతా చైతన్య మవ్వాలని ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవాలని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం "సర్"స్పెషల్ ఇన్సెంటి రివిజన్ పేరుతోని దాదాపు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించిందని అన్నారు. కేంద్ర ఎన్నికల సంస్థను భ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పోలపాక యాదయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహ చారి, ఏఐటియుసి సీనియర్ నాయకులు బోడిగ సుదర్శన్, మామిడికాయల నరేష్,ఇంజమూరి సాయిలు, ఎడవల్లి వేణు, శ్యామల నరేందర్,ఎక్కలదేవి విజయ్, యాట నరసింహ,సోమేశ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ

మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:

తెలంగాణ రాష్ట్రం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని వక్తలు పేర్కొన్నారు. జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గల శ్రీ శివమార్కండేయ దేవాలయ కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 111 వ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన



చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అఖిల భారత పద్మశాలి సంఘం కార్యదర్శి డా.పానుగంటి బాలరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించాలనే తపనతో జీవితాంతం రాజకీయాలకు దూరంగా ఉన్న మహానుభావుడు బాపూజీ అని కొనియాడారు. టీపోపా జిల్లా అధ్యక్షులు డా.భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ జాతిపితగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం నాయకులు సూర ప్రతాప్, దాసు వేంకటేశ్, కుకుడాల బాలకృష్ణ, జన్ను వేంకటేశ్, కెంచె రవిప్రకాష్, పల్లాటి బుచ్చన్న, బోగం శివాజీ, శ్రీరాం జంబులయ్య, కోడి సుకుమార్, వాసి రాజు, ఏరువ దివాకర్, భీంపల్లి శ్రీనివాస్, గుర్రం కృష్ణయ్య, కడదాసు శ్రీనివాస్, బోగం వేంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని విద్యార్థులు ఉపాధ్యాయుల ర్యాలీ

చేర్యాల, అక్షిత ప్రతినిధి: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలలో భాగంగా చేర్యాల మండలంలోని నాగపురి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు



నినాదాలతో సోమవారం గ్రామములో ర్యాలీ నిర్వహించిన అనంతరం పాఠశాలలో ఉపన్యాస పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలికట్టే ఐలయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు, గ్రామ యువత డ్రగ్స్ కు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వాటికి కేటాయించే సమయాన్ని క్రీడలకు కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని ఈ వ్యసనాలు మీ బంగారు భవిష్యత్తును నాశనం చేస్తాయని జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, నిరుపమ, అందే విజయ్ కుమార్, ప్రకాష్ రెడ్డి, మాధవి, రాజేశ్వరి, కనక లింగం, శ్రీధర్, ఉమర్,స్వాములు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత జాతీయ దినపత్రిక AKSHITHA NATIONAL DAILY




## పర్యాటక దినోత్సవ పోటీల్లో కృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

**జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం.. విద్యార్థులకు అభినందనలు**

రామన్నపేట అక్షిత ప్రతినిధి: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ విషయాన్ని పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా పర్యావరణ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఎస్. శరణ్ తేజ్, ఎల్. విశ్వ సాయి, ఎస్. శ్రీకారుణ్య, తస్లీం ఖానం, ఈ. శ్రీవిద్య తదితర విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులతో పాటు వారికి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ మురళిని కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డితో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.వి.ఎన్.ఎస్. మణి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు...

**అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్**

**పెండింగ్ దరఖాస్తులపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు...**

నిర్మల్, సెప్టెంబర్ 28 అక్షిత ప్రతినిధి: నిర్మల్ జిల్లా కేంద్రంలో ప్రజావాణి బాధితులు అందించే అర్జీల పరిష్కారంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించేది లేదని జిల్లా ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, అధికారులను హెచ్చరించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, అధికారులు ఈ దిశగా నిబద్ధతతో పనిచేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన స్వయంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు.



### క్షేత్రస్థాయిలో పరిశీలన.. వేగవంతమైన చర్యలు

మండలాల వారీగా పేరుకుపోతున్న పెండింగ్ దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాథోడ్ రమేష్ ఆదేశించారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా.. సమస్య స్వభావాన్ని బట్టి తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని తేల్చిచెప్పారు. పలు శాఖలకు ముడిపడి ఉన్న సమస్యలను ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు.

### భూ సమస్యలు, పింఛన్లపైనే వినతులు అధికం

ఈ ప్రజావాణిలో ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, విద్య, వైద్యం తదితర అంశాలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు అందాయి. ప్రతి అర్జీనీ బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

## ముల్కనూర్ సొసైటీ రైతులకు దసరా కానుకగా మూడు కోట్ల యాభై లక్షల బోనస్

**త్వరలో మరిన్ని సంక్షేమ సేవలు - సొసైటీ అధ్యక్షులు- అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి**

భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిధి: ముల్కనూరు సొసైటీ రైతులకు రానున్న దసరా కానుకగా మూడున్నర కోట్ల బోనస్ అందించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అలిగి రెడ్డి ప్రవీణ్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మరియు మార్కెటింగ్ సొసైటీ 70వ వార్షిక మహాసభ సోమవారం జరిగింది. మొదటగా సొసైటీ నివేదికను లోన్స్ మేనేజర్ గొల్లపల్లి రాజమౌళి చదివి వినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రవీణ్ రెడ్డి మాట్లాడారు. సొసైటీ ద్వారా 426 కోట్ల వ్యాపారం జరగగా ఏడు కోట్ల 22 లక్షల లాభాలు వచ్చాయన్నారు. రైతులకు అన్ని రకాల సంక్షేమ సేవల ద్వారా 13 కోట్ల 13 లక్షల రూపాయలు నగదు రూపేన లాభం జరిగిందన్నారు. 47 కోట్ల విత్తన ఉత్పత్తి సీడ్స్ రెండు లక్షల క్వింటాలు అమ్మకాలు జరిగాయన్నారు. పత్తి 17వేల క్వింటాలు సేకరించి అమ్మడం జరిగిందన్నారు. సన్న రకం ధాన్యానికి బోనస్ 200, దొడ్డు రకం 125, పత్తి బోనస్ 300 ఇవ్వడం జరుగుతుందన్నారు. పంట అప్పు మాఫీ 141 మందికి 96 లక్షలు జరిగిందన్నారు. 800 మంది రైతులకు సొసైటీ అందించే పెన్షన్ ద్వారా 90 లక్షల ఇవ్వడం జరిగిందన్నారు. ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు 97 మందికి 16 లక్షలు అందించామన్నారు. సభ్యుల భార్యాభర్తలకు కండ్ల ఆపరేషన్ కోసం 169 మందికి 11 లక్షలు ఖర్చు చేశామన్నారు. పంట అప్పు 50 వేలకు, దహన సంస్కారాల కోసం 15 వేలకు పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మార్పాటి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులు వీరయ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్, అక్షిత బ్యూరో: జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 220 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రెవెన్యూ శాఖకు 56, జీడబ్ల్యూఎంసీకి 74, హౌసింగ్ శాఖకు 16, డీఆర్డీవో 15 రాగా ఇతర శాఖలకు సంబంధించిన 59 దరఖాస్తులు వచ్చాయి.

అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను




ఆదేశించారు.

ఈ సందర్భంగా ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డిఆర్డిఓ శాఖల పరిధిలో అధికంగా దరఖాస్తు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జడ్పీ సీఈవో వసంత, తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలొస్తే కాంగ్రెస్‌దే గెలుపు

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**జ్ఞానేశ్‌కుమార్.. బీజేపీ కండువా కప్పుకోండి**

**మంత్రి వాకిటి శ్రీహరి**

**వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే సహించం**

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

వనపర్తి అక్షిత ప్రతినిధి:
దేశంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీదే విజయమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపు, టీపీసీసీ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి సమీకృత కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన శాంతియుత నిరసన ధర్నా కార్యక్రమం డిసిసి చీఫ్ శివసేనరెడ్డి అధ్యక్షతన చేపట్టారు. వనపర్తి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన 'ఎలక్షన్ చోర్ ఆఫ్ ఇండియా' నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖలతో పాటు క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, శాసనసభ్యులు మేఘా రెడ్డి, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఓట్ల చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మొదటి నుంచీ దేశ ప్రజలకు ఆధారాలతో ప్రజెంటేషన్లు ఇస్తున్నారని తెలిపారు. ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని బీజేపీ వరుసగా మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఎన్నికల సంఘం అడ్డుపెట్టుకుని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు చేపడుతోందన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకుని, ఆయనను పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని పొంగులేటి డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా పనిచేయాలని, ప్రతి అర్హుడైన పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.

### జ్ఞానేశ్‌కుమార్.. బీజేపీ కండువా కప్పుకోండి

**మంత్రి వాకిటి శ్రీహరి**

బీజేపీయేతర పార్టీలు బలంగా ఉన్న చోట్ల ఓట్లను చీల్చి రాజకీయ లబ్ధి పొందేందుకే 'సర్' ప్రక్రియను అస్త్రంగా ఉపయోగిస్తున్నారని మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో అర్హులైన ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగించే కుట్ర జరుగుతోందని తీవ్రంగా విమర్శించారు. దశాబ్దాలుగా ఓటు హక్కు కలిగిన వారి పేర్లను సైతం 'సర్' పేరుతో జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఒకసారి రాముడి పేరుతో.. మరోసారి అక్షింతలతో.. ఇప్పుడు ఓట్ల జాబితాతో అంటూ బీజేపీపై శ్రీహరి విరుచుకుపడ్డారు. ప్రజల చేతిలో ఉన్న ఓటు అనే వజ్రాయుధాన్ని లాక్కునే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. బెంగాల్‌లో ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, న్యాయపరమైన వివాదాలు తలెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఓటర్ల హక్కుల విషయంలో ఎన్నికల సంఘం మరింత పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్ఞానేశ్‌కుమార్.. ఇక బీజేపీ కండువా కప్పుకోండి"అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధమైన సంస్థగా ఏ పార్టీకి అనుకూలంగా కాకుండా ఓటర్ల హక్కులకు కాపలాదారుగా ఉండాలని అన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటును కూడా తొలగించకుండా ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని శ్రీహరి స్పష్టం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.




### వ్యవస్థలను నిర్వీర్యం చేస్తే సహించం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

స్వయం ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారంటూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారని పేర్కొన్నారు. దేశాన్ని ఎన్నో పార్టీలు పాలించినా వ్యవస్థలను బలహీనపర్చలేదని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని అన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకునేందుకు మరిన్ని ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఓట్ల ద్వారానే ప్రభుత్వాలు అధికారంలోకి వస్తాయని, ప్రజల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని జూపల్లి స్పష్టం చేశారు. ఓట్ల చోరీకి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేసి ఆదర్శంగా నిలవాలని డిమాండ్ చేశారు.

### ఓట్ల చోరీకి సూత్రధారి జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలి : డీసీసీ చీఫ్ శివసేనరెడ్డి

దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన ఓట్లను తొలగించే కుట్రకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ బాధ్యత వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షులు శివసేనరెడ్డి ఆరోపించారు. ఓట్ల చోరీకి సూత్రధారిగా వ్యవహరించిన జ్ఞానేశ్‌కుమార్‌ను తక్షణమే అరెస్టు చేసి, పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును హరించే చర్యలకు పాల్పడిన వారిపై రాజ్యాంగబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల కమిషన్‌లోనే విభేదాలు బయటపడటం ఆందోళనకరమన్నారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషీలు గత పది నెలల్లో 14సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు మరిన్ని అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఉన్న ఫామ్-6 ప్రక్రియను కూడా ఇబ్బందికరంగా మార్చుతున్నారని శివసేనరెడ్డి విమర్శించారు. కొత్త ఓటర్ల నుంచి వారి తల్లిదండ్రులు, తాతముత్తాతలకు సంబంధించిన వివరాలను కోరుతూ అనవసరమైన నిబంధనలతో యువతను ఓటు నమోదు నుంచి దూరం చేస్తున్నారని ఆరోపించారు. కొత్త ఓట్లు నమోదుకాకుండా అడ్డంకులు సృష్టించడం ద్వారా భవిష్యత్ ఎన్నికల్లో యువత ఓటు హక్కుపై ప్రభావం చూపే ప్రయత్నం జరుగుతోందన్నారు. దేశ యువత ఈ పరిణామాలను గమనించాలని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడానికి అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు



జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, యువతకు చెందిన అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను కాంగ్రెస్ సహించబోదని శివసేనరెడ్డి స్పష్టం చేశారు. ఓటు అనేది కేవలం ఎన్నికల సమయంలో వేసే గుర్తు కాదని.. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు అని అన్నారు. ఆ హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.

### జ్ఞానేశ్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలి : ఎమ్మెల్యే మేఘారెడ్డి

కేంద్ర ఎన్నికల కమిషన్‌లోని ముగ్గురు సభ్యుల్లో ఇద్దరు సక్రమంగా విధులు నిర్వర్తిస్తుండగా, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ మాత్రం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆరోపించారు. బీజేపీకి ప్రత్యక్షంగా సహకరిస్తూ ఓటు చోరీకి ఆజ్యం పోస్తున్న జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్‌లో పారదర్శకతను కాపాడేందుకు కొత్త సభ్యులను నియమించాలని కోరారు. మధ్యప్రదేశ్, గుజరాత్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించడాన్ని ఆయన ప్రస్తావించారు. ఓటర్ల జాబితా ప్రక్రియను అడ్డుపెట్టుకుని ఓట్లను తొలగిస్తూ, మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతోందన్నారు. సుప్రీంకోర్టు సూచించిన విధానాలకు అనుగుణంగా ఎన్నికల కమిషన్ నియామకాల్లో పారదర్శకత పాటించాలని, ప్రజల ఓటు హక్కుకు పూర్తి రక్షణ కల్పించాలని మేఘారెడ్డి డిమాండ్ చేశారు. ఈ యొక్క నిరసన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్ శ్రీమతి కొల్లే సరిత తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ధనలక్ష్మి, సాయి చరణ్ రెడ్డి, జనార్దన్ సాగర్, కోళ్ల వెంకటేష్, బి కృష్ణ, మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, సత్యశీలా రెడ్డి, మండల అధ్యక్షులు నక్క రవి కిరణ్, పట్టణ అధ్యక్షులు రాములు, రామ్ రెడ్డి, నరహరి, కృష్ణ యాదవ్, దయాకర్ రెడ్డి, విష్ణు ముదిరాజ్, కౌన్సిలర్లు మహేశ్వరి, విజయలక్ష్మి, యువజన కాంగ్రెస్ నాయకులు పాండు సాగర్, శివకుమార్ నాయుడు, యాదగిరి, అరవింద్ నాయక్, తిరుపతి నాయక్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, కోట్ల రవి, జిల్లా మైనార్టీ నాయకులు అయూబ్ ఖాన్, ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

**ఓటు చోరీకి వ్యతిరేకంగా కరీంనగర్ కలెక్టరేట్ ముందు**

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన

కరీంనగర్ అక్షిత బ్యూరో:
కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణ, ఓటు చోరీ ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఈ నిరసనలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేసి సీఈసీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహ రిస్తున్నారని, ఓటర్ల జాబితాలో ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల చేర్పుల్లో అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు.

మోడి ప్రభుత్వం అధికారంలోకి ఎన్నికల కమిషన్ కూడా బీజేపీ అనుబంధ సంస్థగా ఎన్నికల సంఘం ను వాడుకుంటున్నాడని ఆరోపించారు. చిప్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ తన సొంత ఏజెండా తోని మోడి అమిత్ షా కు ఏజెంట్‌గా మారి ఓటు చోరికి పాల్పడుతున్నారని ఆరోపిం




చారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ గెలిచిన ప్రాంతాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయన్న తమ ఆరోపణలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలని కోరారు.

ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకునేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పోరాడాలని ఎమ్మెల్యేలు పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ, వెలిచాల రాజేందర్ రావు, నరేందర్ రెడ్డి, సూడా మాజీ చైర్మెన్ కోమిటి రెడ్డి నరేందర్ రెడ్డి తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా భగత్ సింగ్ జయంతి

**నివాళులర్పించిన కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి**

కాజీపేట్, అక్షిత ప్రతినిధి: భారత స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా సోమవారం హన్మకొండలోని భగత్ సింగ్ విగ్రహానికి కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."దేశం కోసం 23 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ త్యాగం ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం. 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే నినాదంతో బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీరుడు భగత్ సింగ్. ఆయన ఆశయాలను, దేశభక్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల చరిత్రను ఇపుడున్న కేంద్ర ప్రభుత్వం తొక్కిపెడున్నదని, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం లోనే అమరవీరులకు నిజమైన గౌరవం దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల మార్కెట్ యార్డును ఉపయోగంలోకి తీసుకురావాలి

చౌటుప్పల్ /అక్షిత న్యూస్: గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం, చౌటుప్పల మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి కి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో 2024లో



రూర్బన్ మిషన్ ద్వారా 50 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డ్ ను వెంటనే నిర్వాణలోకి తీసుకురావాలని కోరుతూ వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ మాట్లాడుతూ...ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని నిర్మించిన గొర్రెల మార్కెట్ యార్డ్ నేడు నిరుపయోగంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

గొర్రెల తాగునీటి కోసం నిర్మించిన బోరు మోటరు గుర్తు తెలియని వ్యక్తులు దొంగి లించారని తెలిపారు. మూగ జీవాల కోసం త్రాగునీటి కోసమై నిర్మించిన నల్లాలను కూడా ధ్వంసం చేసినారని తక్షణమే అధికారులు చర్య తీసుకుని గొర్రెల మార్కెట్ యార్డ్ ని వినియోగంలోకి తీసుకురావాలని జిఎంపిఎస్ నాయకత్వంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. సరైన వసతి సౌకర్యాలు లేక గొర్రెల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ జిల్లా డైరెక్టర్ బందారు నరసింహ, జీఎంపీస్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ, నాయకులు అవిశెట్టి పాండు, పాక జహం, చౌటుప్పల మండల కార్యదర్శి కొండే శ్రీశైలం, మున్సిపల్ కన్వీనర్ గుణమోని ఐలయ్య, సంఘం మండల ఉపాధ్యక్షులు గజ్జి పాండు లు పాల్గొన్నారు.

## యువత వ్యాపార రంగాల్లో రాణించాలి

**- సర్పంచ్ దున్నా శ్రీనివాస్.**

నడిగూడెం, అక్షిత న్యూస్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత వ్యాపార రంగాల్లో రాణించాలని నడిగూడెం గ్రామ సర్పంచ్ దున్నా శ్రీనివాస్ కోరారు. సోమవారం నడిగూడెం మండల కేంద్రంలో సిరిపురం గ్రామానికి చెందిన యువకుడు అబ్దుల్ సలీం నూతనంగా ఏర్పాటు చేసిన మన మొబైల్ జోన్ సెల్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు మార్గాలకు బానిసలు కాకుండా, సన్మార్గంలో నడుస్తూ ఉపాధి రంగాలను ఎంచుకొని స్వశక్తితో ఎదగాలని సూచించారు. కష్టమర్లకు మంచి సర్వీస్ అందిస్తూ అందరి మన్ననలు పొందాలన్నారు. నూతనంగా ప్రారంభించిన సెల్ షాప్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయ కులు కాసాని వెంకటేశ్వర్లు, గుండు శ్రీనివాస్, ఒట్టికూటి చలపతి, పసుపులేటి రఘు, ప్రొప్రైటర్ అబ్దుల్ సలీం, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా పూర్తి

**- చైర్మన్‌గా గొజ్జ జనార్దన్ ఎన్నిక**

నిర్మల్, అక్షిత ప్రతినిధి: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు సోమవారం నిర్మల్‌లో ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. మొత్తం 15 మంది సభ్యులు పూర్తి కోరంతో ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నారు. చైర్మన్ పదవికి యాటకారి సాయన్న, గొజ్జ జనార్దన్ పోటీ చేయగా, అత్యధిక మెజార్టీతో గొజ్జ జనార్దన్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఎంపీ లింగన్న వైస్ చైర్మన్‌గా, అల్లాడి రవి ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సామసప్పల్లి రాఘవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి కె. సత్యనారాయణ తెలిపారు.ఎన్నికల ప్రక్రియను సహాయ ఎన్నికల అధికారి శరత్ బాబు, సహాయకులు సాయందర్, సిబ్బందితో సమన్వయంతో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా, శాంతియుతంగా పూర్తయింది. ఎన్నికైన నూతన మేనేజింగ్ కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

రంగారెడ్డి అక్షిత బ్యూరో: సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ మొత్తం 89 అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజల నుంచి అర్జీలనుస్వీకరించివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు, మొత్తం 89 అర్జీలు అందాయి. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మునగాల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి

**ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలి**

అక్షిత న్యూస్ మునగాల

మునగాల మండల కేంద్రానికి ప్రతిరోజూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ కార్యాలయాలుబ్యాంకులుఆసుపత్రులుమార్కెట్వ్యాపార సంస్థలకు వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారని తెలిపారుఅయితే ప్రజలకు అందుబాటులో ఉండే పబ్లిక్ టాయిలెట్ల సౌకర్యం తగినంతగా లేకపోవడంతో మహిళలువృద్ధులు




చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు

ముఖ్యంగా మార్కెట్ ప్రాంతంప్రధాన రహదారిశ్రీప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో పబ్లిక్ టాయిలెట్ల అవసరం ఎక్కువగా ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనువైన ప్రదేశాలను గుర్తించి మహిళలు, పురుషులకు వేర్వేరుగా పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలని కోరారు

అలాగే టాయిలెట్ల వద్ద తాగునీరువిద్యుత్పారిశుద్ధ్య నిర్వహణ వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మించిన టాయిలెట్లు నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు(మండల కేంద్రానికి నిత్యం వచ్చే ప్రజల దీర్ఘకాలిక అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి అవసరమైన చర్యలను వీలైనంత త్వరగా చేపట్టాలని మరువాడ ఆంజనేయ శర్మ అధికారులను కోరారు

## భగత్ సింగ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**-సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్**

చౌటుప్పల్/ అక్షిత న్యూస్: దేశం కోసం పోరాడిన భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తామని సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్ అన్నారు. సోమవారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ స్థానిక పార్టీ నాయకులతో కలిసి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...భగత్ సింగ్ దేశ స్వాతంత్రం కోసం ప్రాణం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. దేశంలోని యువతలో దేశభక్తి, సామాజిక చైతన్యం, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడే స్ఫూర్తిని నింపడంలో ఆయన జీవితం నేటికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భగత్ సింగ్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి పాషా, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, ఉష్కాగుల శ్రీనివాస్, ఎండి ఖయ్యూం,తూర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బొడ్డు రాజు, బొడ్డు అంజిరెడ్డి, ఆర్టీవో పాషా, యాదగిరి, అంతటి అశోక్, గౌస్ పాషా లు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ట్రైనీ కలెక్టర్ జోస్విన్ జోల్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని దహెగాం మండలం రనవెల్లి గ్రామానికి చెందిన కోలే స్వర్ణలత తన భర్త చనిపోయినందున అతని పేరిట ఉన్న భూమిని తన పిల్లల పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జన్కపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి గ్రామంలో రోడ్ ఆక్రమణతో పాటు బతుకమ్మ గద్దెని కూల్చి స్థలం ఆక్రమించుకొని స్థలానికి పెంచన్ ఏర్పాటుచేసి ప్రధాన రహదారికి వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం మాణిక్ గూడకు చెందిన జాదవ్ లలితభాయి తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లింగాపూర్ మండలం పీర్లతండకు చెందిన పంచాయతీ సర్పంచ్ భానోత్ కృష్ణ, ఉపసర్పంచ్ బోడ సీత లు కలిసి వార్డు మెంబర్లను సమావేశనికి పిలవకుండా, ఆమోదం లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానపల్లి మండలం రుద్రపూర్ గ్రామానికి చెందిన కల్పన తన పేరు మీద ఉన్న భూమికి సంబంధించిన వివరాలను ఆన్లైన్‌లో నమోదుచేసి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని



కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ గ్రామానికి చెందిన బొమ్మరే మహేష్ తాను దివ్యాంగుడిని అని, నిత్యవసరం కోసం బయటికి వెళ్లడానికి తనకు ఈ.వి. బైక్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

చోర్‌పల్లి గ్రామానికి చెందిన మిట్ట మల్లయ్య కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకోడానికి ప్రయత్నించగా, జిల్లా కలెక్టర్ స్పందించి మిట్ట మల్లయ్య తన కూతురు గోలెం సమత పేరిట ఉన్న భూమిని తన పేరిట మార్చాలని దరఖాస్తు చేసుకున్నారని, ఈ విషయం



సివిల్ మేటర్ కావడంతో పాటు పిఓ ఐటిడిఏ ఏజెన్సీ కోర్టులో గోలెం సమత 2020లో కేసు నమోదు చేయడం వల్ల ఈ విషయాన్ని ఏజెన్సీ కోర్టులో తేల్చుకోవాలని నిర్దేశించారు. సదరు మిట్ట మల్లయ్య స్వయంగా తన కూతురు, కొడుకుల పేరిట 2024 జూన్ లో భూమిని పార్టిషన్ గా బదలాయింపు చేశారని, అక్టోబర్ 3వ తేదీన కేసు ఏజెన్సీ కోర్టులో విచారణకు ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు భద్రతా కవచం

**కలెక్టరేట్, హెలిప్యాడ్, పరిసరాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన**

**కలెక్టర్, సీపీ, సీఎం భద్రతా అధికారుల సమీక్ష**

**సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం.**

కరీంనగర్ అక్షిత బ్యూరో:

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం కరీంనగర్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సీఎం భద్రతా అధికారులు నూతన కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని హెలిప్యాడ్, తెలంగాణ తల్లి విగ్రహం, నూతన కలెక్టరేట్ భవనం, సమావేశ మందిరం, జిల్లా కలెక్టర్ నూతన చాంబర్, పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ సిపి, సీఎం భద్రతా అధికారులు పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక, కార్యక్రమాల నిర్వహణ, కాన్వాయ్ రాకపోకలు, తిరుగు ప్రయాణం వరకు చేపట్టాల్సిన భద్రతా చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రత, ప్రోటోకాల్, ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందు నిర్వహించే అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజన్ సమీక్షలో భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, హెలిప్యాడ్, సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ప్రోటోకాల్ తదితర అంశాలను సమీక్షించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా



పాటించాలని అధికారులకు సూచించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో తూచా తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. నిర్దిష్ట సమయంలోగా ఏర్పాట్లను పూర్తి చేసి, ప్రతి అంశాన్ని పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు, నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా పనిచేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రత్యేకంగా రోడ్లు--భవనాలు, అటవీ, విద్యుత్, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ




తదితర శాఖల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెలిప్యాడ్ వద్ద సీఎం స్వాగతం నుంచి తిరిగి హెలికాప్టర్ బయలుదేరే వరకు ప్రతి దశలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సీఎం కాన్వాయ్, గౌరవ వందనం, భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. విధులు కేటాయించిన రోప్ సిబ్బంది, రూట్ అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు పార్కింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పోలీసు సిబ్బందికి సహకరిస్తూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, సీఎంవో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ అధికారులు ఎస్పీ రామచందర్‌రావు, డీఎస్పీలు దుర్శేటి రఘు చందర్, శ్యామ్ వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్ కివచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి

**-డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన**

భద్రాచలం,అక్షితన్యూస్: భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనులు వివిధ సమస్యల పరిష్కారానికి పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన యూనిట్ అధికారులను ఆదేశించారు..

మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలనుండి గిరిజన దర్బార్ లో అర్జీలు సమర్పించడానికి వచ్చే గిరిజనులను కార్యాలయం చుట్టూతిప్ప వద్దని ఆమె సూచించారు..

సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున కారణంగా గిరిజన దర్బార్ లో విన్నవించడానికి వచ్చిన గిరిజనుల నుండి ఎస్ డి సి ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏ డి ఎం హెచ్ ఓ డా,సైదులు యూనిట్ అధికారుల సమక్షంలో ఆమె అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. సోమవారం గిరిజన దర్బార్ కు ఎక్కువ శాతం గిరిజనులు పోడు భూముల పట్టాల కొరకు, గిరి వికాసం ద్వారా సబ్సిడీపై కరెంటు, బోరు, మోటార్ల కొరకు, పోడు భూముల పట్టాలు ఆన్లైన్ చేయించుట కొరకు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక వెసులుబాటు కల్పించుట కొరకు, అలాగే భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ,గిరిజన గ్రామాలలో వ్యవసాయం చేసుకోవడానికి బోరు, మోటార్లు ఇప్పించుట కొరకు, మారుమూల ప్రాంత గిరిజన గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం, కరెంటు ఇప్పించుట కొరకు, సోలార్ విద్యుత్ సరఫరా ఇప్పించుట కొరకు, నూతనంగా మత్స్య సొసైటీలు



ఏర్పాటు కొరకు, వితంతు, ఒంటరి మహిళ, ఆసరా పెన్షన్లు ఇప్పించుట కొరకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి వ్యక్తిగత శిక్షణలు ఇప్పించుట కొరకు, అలాగే దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం అందించుట కొరకు, గిరిజనులు అర్జీలు పెట్టుకున్నారని ఆమె పేర్కొన్నారు..

గిరిజన దర్బార్‌లో వచ్చిన అర్జీలు అన్ని ప్రత్యేకమైన రిజిస్టర్లో, ఆన్లైన్ ద్వారా నమోదు చేసి విడతలవారీగా అర్హులైన ప్రతి గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తామని ఆమె చెప్పారు..

ఈ కార్యక్రమంలో ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు,ఏపీఓ పవర్ వేణు, కొండరెడ్ల విభాగం అధికారి గనియా నాయక్,జేడీఎం మిషన్ భగీరథ ఏ ఈ ఈ ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, హెచ్ ఈ ఓ,నరేందర్, నాగేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాదాన్యత ఇస్తుంది

**రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

వనపర్తి అక్షిత ప్రతినిధి:

ప్రజాపాలన ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాదాన్యత ఇస్తునందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పర్యటన సందర్భంగా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో రూ. 12.75 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణా పబ్లిక్ స్కూల్, వనపర్తి మండలం చిట్యాల గ్రామ పరిధిలో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జ్యోతిభా పూలే బాలుర గురుకుల కళాశాల భవనానికి సహచర మంత్రులు రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించిన ప్రజా ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యత



ఇస్తుందని చెప్పారు.

ఇందులో భాగంగానే ఈరోజు వెల్టూర్ గ్రామంలో రూ. 12.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణలో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమమైన విద్య అందించలేకపో యామని బాధ కలగకుండా ఈరోజు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పేద ప్రజలు తమకు అనారోగ్యం వచ్చినపుడు మెరుగైన వైద్యము చేయించుకోలేక తమ వారు ప్రాణాలు కోల్పోయారని బాధపడకుండా తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రార్థన తెచ్చి కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుంది అన్నారు. తమ ప్రభుత్వంలో రైతులను రాజు చేయాలానే ఉద్దేశంతో ఈరోజు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యనికి 500 బోనస్ ఇవ్వడం జరుగుతుంది. నిరుద్యోగ యువతకు ఇప్పటికే వేలాది ఉద్యోగాలు ఇవ్వడంతో పాటుగా కొత్తగా మరికొన్ని వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశంతో 70 వేల కోట్ల రూపాయలు సున్నా వడ్డీకే రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యులు తుడి మెగారెడ్డి అభ్యర్థన మేరకు వెల్టూరు గ్రామాన్ని త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో కొన్ని కొత్త మండలాలు ఇవ్వడంతోపాటు కొత్త డివిజన్లు ఏర్పాటు చేయాల్సిన ఉందని, వాటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వెల్టూరులో రూపాయలు 12.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ అతిపెద్ద గ్రామమైన వెల్టూరును మండల కేంద్రం చేయాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖతార్‌లో ఖాకీల అదుపులో నిర్మల్ యువకులు.. విదేశాంగ శాఖను కదిలించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**పోలీసు కస్టడీలో ఉన్న నిర్మల్ వలస కార్మికుల కోసం రంగంలోకి దిగిన బీజేపీ ఎల్పీ నేత...**

**తెలంగాణ ప్రభుత్వం, విదేశాంగ శాఖ, దోహా ఎంబసీ అధికారులతో ముమ్మర సంప్రదింపులు**

**యువకులను సురక్షితంగా రప్పించేందుకు వేగవంతమైన చర్యలు.. కుటుంబాల్లో పెరుగుతున్న ఆశలు...**

నిర్మల్,సెప్టెంబర్ 28 అక్షిత ప్రతినిధి :

ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ దేశానికి వెళ్లిన నిర్మల్ జిల్లా యువకులు ఖతార్‌లో పోలీసుల అదుపులో చిక్కుకోవడం తీవ్ర కలకలం రేపింది.ఈ సంక్షోభ సమయంలో బాధితుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే శ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి,తక్షణమే స్పందించారు. కార్మికులను క్షేమంగా స్వదేశానికి రప్పించేందుకు దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేయించారు.

### అసలేం జరిగింది?

నిర్మల్ జిల్లా దిలావార్పూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కుంచపు గణేష్,సోన్ మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన దేశభోయి సంపత్, జీవనోపాధి నిమిత్తం ఖతార్‌కు వలస వెళ్లారు. అయితే అక్కడ ఊహించని పరిణామాల మధ్య వారు ఖతార్ పోలీసుల కస్టడీలో చిక్కుకున్నారు. ఈ వార్త తెలియగానే వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. దిక్కుతోచని స్థితిలో వారు నేరుగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ని ఆశ్రయించి తమ గోడును వెళ్లబోసుకున్నారు.

### యుద్ధప్రాతిపదికన స్పందించిన ఎమ్మెల్యే

కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, అత్యున్నత స్థాయి స్పందన కనబరిచారు. బాధితుల విడుదలకు తక్షణమే రంగంలోకి దిగారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, దోహాలోని భారత రాయబార కార్యాలయం, అలాగే నిర్మల్ జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమన్వయం చేసుకున్నారు. యువకులకు అవసరమైన న్యాయపరమైన సహాయాన్ని అందించాలని, చట్టపరమైన చిక్కులను తొలగించి వీలైనంత త్వరగా వారిని విడిపించాలని దౌత్య వర్గాలను కోరారు.

### బాధిత కుటుంబాలకు భరోసా

యువకులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు ఈ అంశాన్ని విడిచిపెట్టబోమని, ప్రతి క్షణం తానే స్వయంగా పర్యవేక్షిస్తానని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి,బాధిత కుటుంబాలకు ఘంటాపథంగా హామీ ఇచ్చారు. విదేశాల్లో మన దేశస్తులు ఏ కష్టాల్లో ఉన్నా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వేగవంతమైన జోక్యం, ప్రత్యేక చొరవతో వలస కార్మికుల కుటుంబాల్లో మళ్లీ ఆశలు చిగురించాయి...

# సంక్లిష్ట ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో ఆధునిక విధానాలు

**-చిన్న కోతలతోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు..**

**రోగులు త్వరగా కోలుకునే అవకాశం**

**-మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయక శస్త్రచికిత్సలపై**

**యశోద వైద్యుల అవగాహన**

**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** సంక్లిష్టమైన ఛాతీ వ్యాధుల చికిత్సలో ఆధునిక శస్త్రచికిత్సా విధానాలు కీలకంగా మారుతున్నాయని సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు తెలిపారు. సంగారెడ్డి పట్టణంలోని రెడ్లాస్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రికి చెందిన ఛాతీ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ రోహన్ రెడ్డి మాట్లాడుతూ ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతీ మధ్యభాగం, డయాఫ్రమ్, ఛాతీ గోడకు సంబంధించిన వివిధ వ్యాధులకు ఆధునిక వైద్య విధానాలతో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో ఏర్పడే కణితులు తదితర వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న కోతల ద్వారా చేసే కనిష్ఠ కోత శస్త్రచికిత్సలు, వీడియో కెమెరా సహాయంతో నిర్వహించే వీడియో సహాయక ఛాతీ శస్త్రచికిత్స (వీఏటీఎస్), రోబోట్ సహాయంతో చేసే రోబోటిక్ ఛాతీ శస్త్రచికిత్స (ఆర్ఏటీఎస్) వంటి ఆధునిక విధానాలు అందుబాటులోకి రావడంతో రోగులకు చికిత్స మరింత సౌకర్యవంతంగా మారిందన్నారు. సాధారణంగా ఛాతీకి సంబంధించిన కొన్ని సంక్లిష్ట వ్యాధులకు ఛాతీని పెద్దగా తెరిచి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చేదని, అయితే ఆధునిక సాంకేతికత అభివృద్ధితో అనేక సందర్భాల్లో చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం ఏర్పడిందని తెలిపారు. దీనివల్ల శస్త్రచికిత్స అనంతరం నొప్పి, కోత పరిమాణం తగ్గడంతో పాటు రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఆసుపత్రిలో ఉండే కాలం కూడా




కొన్ని సందర్భాల్లో తగ్గే అవకాశం ఉందన్నారు. ఆధునిక సాంకేతికతతో మరింత కచ్చితమైన చికిత్స యశోద ఆసుపత్రి ఛాతీ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ రోహన్ రెడ్డి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో ఛాతీ శస్త్రచికిత్స రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. చిన్న కోతలతో పాటు రోబోట్ సహాయంతో నిర్వహించే శస్త్రచికిత్సల ద్వారా సంక్లిష్టమైన వ్యాధులకు కూడా మరింత కచ్చితత్వంతో చికిత్స అందించే అవకాశం ఏర్పడిందన్నారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, ఆధునిక శస్త్రచికిత్సా నైపుణ్యాలు, వివిధ వైద్య విభాగాల నిపుణుల సమన్వయంతో చికిత్స అందించడం ద్వారా రోగులకు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్సా విధానాన్ని ఎంపిక చేస్తూ, ఆధునిక సాంకేతికతతో పాటు మానవీయ దృక్పథంతో వైద్యం అందించడమే తమ లక్ష్యమన్నారు. యశోద ఆసుపత్రిలో అధునాతన శస్త్రచికిత్స గదులు, అత్యుత్తమ చిత్రీకరణ వ్యవస్థలు, రోబోటిక్ శస్త్రచికిత్సా వేదికతో పాటు ఛాతీ శస్త్రచికిత్స నిపుణులు, ఊపిరితిత్తుల వైద్యులు, క్యాన్సర్ నిపుణులు, రేడియాలజీ నిపుణులు, మత్తుమందు వైద్యులు, అత్యవసర చికిత్స నిపుణులతో కూడిన బహుళ విభాగాల వైద్య బృందం సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోని ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక వ్యాధుల నుంచి ఛాతీలోని కణితులు, సంక్లిష్టమైన ఛాతీ అత్యవసర పరిస్థితుల వరకు వివిధ రకాల సమస్యలకు సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధారాలతో నిరూపితమైన ఆధునిక వైద్య విధానాలను అనుసరిస్తూ, కనిష్ఠ కోత శస్త్రచికిత్సలను విస్తరిస్తున్నామని తెలిపారు.

**-ఊపిరితిత్తుల మార్పిడి సేవలు**

తీవ్రస్థాయి ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి సేవలను కూడా యశోద ఆసుపత్రులు అందిస్తున్నాయని వైద్యులు తెలిపారు. దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధి, ఊపిరితిత్తుల కణజాలం గట్టిపడే వ్యాధి, ఊపిరితిత్తుల రక్తనాళాల్లో అధిక రక్తపోటు వంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక వైద్య బృందం ద్వారా సమగ్ర సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఊపిరితిత్తుల మార్పిడికి ముందు, శస్త్రచికిత్స సమయంలో, అనంతరం అవసరమైన అత్యవసర చికిత్స, పునరావాస సేవలను సమన్వయంతో అందిస్తూ రోగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.

**-మూడు దశాబ్దాలుగా వైద్య సేవలు**

యశోద ఆసుపత్రుల సమూహం గత మూడు దశాబ్దాలుగా వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అరుదైన, సంక్లిష్టమైన వ్యాధులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వివిధ వైద్య విభాగాల్లో రోగనిర్ధారణ, చికిత్సా సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ, సికింద్రాబాద్, మలక్‌పేట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో యశోద ఆసుపత్రులకు నాలుగు స్వతంత్ర వైద్య కేంద్రాలు ఉన్నాయని, మొత్తం సుమారు నాలుగు వేల పడకల సామర్థ్యంతో సేవలు అందిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన వైద్యం, ఆధునిక సాంకేతికత, రోగుల పట్ల మానవీయ దృక్పథంతో సేవలు అందిస్తూ, ఆధునిక కనిష్ఠ కోత చికిత్సలను మరింత విస్తృతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

**వి బి జి రాంజీ ఉపాధి పనులపై**

# ప్రణాళికలు సిద్ధం చేయాలి

**- ఎంపీడీవో మల్సూర్ నాయక్**

**నడిగూడెం, అక్షిత న్యూస్:** మండలంలోని అన్ని గ్రామాల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి చేపట్టబోయే వి.బి.జి రాంజీ ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో మల్సూర్ నాయక్ కోరారు.సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వి.బి.జి రాంజీ ఉపాధి హామీ పనులపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ అన్నారు.



374 రకాల పనులను వి బి జి రాంజీ ఉపాధి హామీ ద్వారా చేపట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు దున్నా శ్రీనివాస్, కంభంపాటి సరిత చైతన్య, నరసింహారావు, విమలపంగు సరోజినీ రంగయ్య,పాటిబండ్ల రుక్మిణి వెంకటేశ్వర్లు,ఏపీఓ శ్రీనివాసరావు,ఈసీ శ్రీనివాస్,నడిగూడెం పంచాయతీ యలక ఉమారాణి,వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,టి ఏ లు,ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.




# పాఠశాలలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు

**పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరు బాధ్యత**

**పర్వతగిరి అక్షిత ప్రతినిధి:** లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ వరంగల్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వర్ధన్నపేట ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా పాఠశాలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ జనార్ధన్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ కృష్ణ విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛ భారత్ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. వారానికి కనీసం రెండు గంటలు, సంవత్సరానికి 100 గంటలను పరిశుభ్రత కోసం కేటాయించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ భాస్కరాచారి, సిఎఫ్ఎల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, యాకూబ్ పాషా, మణికాంత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, నాజియా సల్మా, ఉపాధ్యాయులు శ్రీరామ్, చందు, ఉపాధ్యాయినులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన సింగిల్ విండో పాలకవర్గం సభ్యులు

**చౌటుప్పల్/ అక్షిత న్యూస్ :**

యాదాద్రి జిల్లా,చౌటుప్పల్ లో నూతనముగా ఏర్పడిన పిఏసిఎస్ చౌటుప్పల్ పాలక వర్గ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసి కమిటీని ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. చేపట్టిన పదవులను బాధ్యత యుతంగా నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చాలని తెలిపారు. చైర్మన్ మస్తాన్ బాబు వైస్ ఛైర్మన్ పర్నే శివారెడ్డి, పాలకవర్గం సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ మార్కెట్



కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ,వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి, సంఘ పాలక వర్గ సభ్యులు బొబ్బిల్ల రాజేందర్ ,సుర్కంటి లక్ష్మమ్మ, జక్కిడి వెంకటరెడ్డి , రావులస్వామి, ఎర్ర పెంటయ్య, మల్కాపురం సుగుణమ్మ, మేకల దేవేందర్ రెడ్డి, పానుగోతు లచ్చిరం,బత్తుల శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మొగుదల రమేష్ గౌడ్, మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాసరెడ్డి,మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, చెన్నగొని అంజయ్య గౌడ్ లు పాల్గొన్నారు.

# శివరాంపల్లి జెడ్ పి హెచ్ఎస్‌లో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్

**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి గ ఆదేశాల మేరకు శివరాంపల్లి జెడ్ పి హెచ్ ఎస్ లో సోమవారం నాడు డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో నషా



ముక్త్ యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వ్యసనాల వల్ల ఎలా మారాల్సి వస్తుందో, ఫ్లెక్సీలు, ఆడియో ద్వారా అవగాహన కల్పించి చెప్పడం, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమం తరువాత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఐ ఓ డా. షీబా నాయక్ , ప్రిన్సిపాల్ భూక్యా నాయక్ , పీహెచ్ సి ఎం .ఓ డా. నిఖిల్, ఆర్ బి ఎస్ కె సిబ్బంది పాల్గొన్నారు.

# సీతానగరంలో డ్రైనేజీ పనులకు శ్రీకారం

**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత**

**సర్పంచ్ బాదావత్ వీరయ్య**

**మునగాల,అక్షిత న్యూస్:** మునగాల మండలం సీతానగరం గ్రామంలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపే దిశగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులను ప్రారంభించారుగ్రామ సర్పంచ్ బాదావత్ వీరయ్య డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు

గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ పనులను చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా మురుగునీరు రోడ్లపైకి రాకుండాప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు

ఈ సందర్భంగా సర్పంచ్ బాదావత్ వీరయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి రాకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు



నిల్వ ఉండకుండా డ్రైనేజీ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు

గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ తెలిపారుడ్రైనేజీ పనులు పూర్తయితే గ్రామంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవిత, సూర్యాపేట జిల్లా డీసీసీ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పల్లపు సతీస్ సీనియర్ జర్నలిస్ట్ పడిశాల నాగరాజు పుల్లూరి మైసయ్యపుల్లూరు వెంకటేశ్వర్లు, పల్లపు సత్యం గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్తకోటలో వరి ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ

**వనపర్తి అక్షిత ప్రతినిధి:**

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం రైతు వేదికలో సోమవారం వరి ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి జాస్మిన్



మాట్లాడుతూ రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు పాటించాల్సిన నిబంధనలపై వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వం నిర్ణయించిన 7 రకాల నాణ్యమైన సన్న రకాల గుర్తింపు, కొనుగోలు కేంద్రాల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై అవగాహన కల్పించారు. నాణ్యమైన సన్న రకాల గుర్తింపు ఇలా ఉండాలని సూచించారు.

సన్న రకం బియ్యం పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ. కంటే తక్కువ ఉండాలి. పొడవు-వెడల్పు నిష్పత్తి 2.5 కంటే ఎక్కువ ఉండాలని తెలిపారు. కేంద్రాల్లో ఈ సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, టెంట్లు, విద్యుత్ సరఫరా, టార్పాలిన్ షీట్లు, శుభ్రపరిచే సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పీపీసీ యాప్ వినియోగం, రైతుల నుంచి పూర్తి సమాచార సేకరణ, రిజిస్టర్ల నిర్వహణ, గ్రెయిన్ కాలిపర్, తేమ యంత్రాల వినియోగంపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారి రాజశేఖర్, ఏపీఎం శ్రీనివాసులు, పామాపురం పీఏసీఎస్ సీఈఓ రాఘవేంద్ర, సెంటర్ ఇన్‌ఛార్జ్‌లు, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో తరగతి విద్యార్థిని విషయంలో మరోసారి ఫిర్యాదు!

**ప్రజావాణిలో తల్లి ఫిర్యాదు..**

**సమస్య పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం...!**

**పాప చదువుకు ఇబ్బంది కలగకుండా చర్యలు**

**తీసుకోవాలని తల్లి డిమాండ్....!**

**నిజామాబాద్, అక్షితబ్యూరో:**

ఆర్మూర్ మామిడిపల్లిలోని విజయ్ హైస్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినికి సంబంధించిన వివాదం మరోసారి జిల్లా అధికారుల దృష్టికి చేరింది. ఘటన జరిగి రోజులు గడుస్తున్నా తమ కుమార్తెకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ విద్యార్థిని తల్లి సోమవారం నిజామాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేశారు.

ఇంతకుముందు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు నేపథ్యంలో విజయ్ హైస్కూల్ యాజమాన్యానికి విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తల్లి తెలిపారు. దీనికి పాఠశాల యాజమాన్యం రెండు రోజుల అనంతరం వివరణ ఇచ్చినట్లు, ఆ వివరణను విద్యాశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అయితే, ఇన్ని రోజులు గడుస్తున్నా తమ కుమార్తె సమస్యపై సంబంధిత అధికారులు తగిన విధంగా స్పందించలేదని విద్యార్థిని తల్లి ఆరోపించారు. పాప పాఠశాలకు వెళ్లకపోతున్నప్పటికీ పాఠశాల యాజమాన్యం నుంచి కూడా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని తెలిపారు.

**కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు...**

తాజాగా మరోసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ స్పందించి, విద్యాశాఖ కార్యాలయ సిబ్బందిని పిలిచి విద్యార్థిని సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు తల్లి తెలిపారు.

అయితే విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తనతో మాట్లాడి, జరిగిన విషయాలను పక్కనపెట్టి రాజీ చేసుకోవాలని సూచించినట్లు విద్యార్థిని తల్లి ఆరోపించారు. తన కుమార్తె చదువుకు ఎలాంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో రాజీకి సిద్ధంగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో పాపకు పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్పష్టమైన హామీ ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు.

**ఎంఈఓ సమక్షంలో రాతపూర్వక హామీ కోరుతున్న తల్లి..!**

విద్యార్థిని తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఈఓ సమక్షంలో పాఠశాల యాజమాన్యం రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని కోరుతున్నారు. తన కుమార్తెను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా, విద్యార్థిని పట్ల



క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని ఒప్పంద పత్రం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

పాప భవిష్యత్తు, చదువును దృష్టిలో పెట్టుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం లభించాలని తల్లి కోరుతున్నారు.

ఇప్పటికే షోకాజ్ నోటీసుకు పాఠశాల యాజమాన్యం వివరణ ఇచ్చిన నేపథ్యంలో, విద్యాశాఖ అధికారులు ఆ వివరణపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? పాఠశాల యాజమాన్యం విద్యార్థిని తల్లి కోరుతున్న రాతపూర్వక హామీకి అంగీకరిస్తుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

విద్యార్థిని భవిష్యత్తుకు భంగం కలగకుండా సమస్యను అధికారులు నిష్పక్షపాతంగా పరిష్కరించాలని తల్లి కోరుతున్నారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నాడు..

**జగిత్యాల అక్షిత ప్రతినిధి- సెప్టెంబర్ 28:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామానికి చెందిన అలియా ఫాతిమ అనే మహిళ తనకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం మహమూద్ అలీ అనే వ్యక్తి మోసం చేశాడని సోమవారం రోజు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉర్దూ మధ్యమంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు బీఈడీ పూర్తి చేసి నిరుద్యోగిగా ఉన్నాను....



తన భర్త స్నేహితుడైన మహిమూద్ అలీ అనే వ్యక్తి జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసు నందు కాంట్రాక్టు పద్ధతిలో సూపర్డెంట్ గా పనిచేస్తున్నాడు..

నీకు మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో నమ్మించి అందుకు ఒక లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని ముందుగా ఒక యాభై వేల రూపాయలు చెల్లించాలని ఆమె నుండి 50 వేల రూపాయలు తీసుకొని నాలుగు సంవత్సరాలు గడిచిన ఎలాంటి ఉద్యోగం ఇప్పించక మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు..

ఉద్యోగం ఇప్పించడం లేదు కదా మా డబ్బులు మాకు తిరిగి ఇవ్వాలని అడగగా రేపు తర్వాత అంటూ కాలయాపన చేస్తూ అంతేకాకుండా ఎవరికైనా ఈ విషయం చెబితే ఒక్క రూపాయి కూడా ఇవ్వను అని మమ్మల్ని బెదిరింపులకు గురి చేస్తున్నాడు. కావున మాయందు దయతలచి మాకు తగిన న్యాయం చేసి మా డబ్బులు మాకు ఇప్పించాలని వారు కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఈర్ష ద్వేషాలతో ఉండకూడదు...

**జగిత్యాల అక్షిత ప్రతినిధి-సెప్టెంబర్ 28**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికర కాంగ్రెస్ పార్టీ పై నిప్పులు చెరిగారు.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసింది. ముఖ్యమంత్రి




రేవంత్ రెడ్డి కేటీఆర్ ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రమంతా ఆయన విధానాన్ని అమలు చేయాలి అని అన్నారు. సిరిసిల్లలో ముఖ్యమంత్రి పర్యటన స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ పై ఎలాంటి ప్రభావం చూపబోదని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి మూడు సంవత్సరాల కాలమైన ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదు.. సిరిసిల్లలో చేనేత కార్మికుల మరియు మహిళా బీడీ కార్మికుల పొట్ట కొట్టారు. రైతాంగాన్ని మోసం చేశారు, అమలు కు నోచుకోని ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారు..

ముఖ్యమంత్రి పర్యటన ఈర్షద్వేషాలతో కూడుకొని ఉండకూడదు...

ఆయన పర్యటన కేటీఆర్ పై ఎలాంటి ప్రభావం చూపదు..

కేటీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి పాలన కొనసాగించాలి..

ముఖ్యమంత్రి మూడు సంవత్సరాలు అయినా ప్రజలకు కానీ రైతంగానికి నేత కార్మికులకు ఏం చేశాడు..సిరిసిల్ల మహిళలు బీడీ కార్మికులుగా వారి భర్తలు నేత కార్మికులుగా ఉన్నారు..

ప్రవీణ్ టు ఫండ్ చెల్లించి మూడు సంవత్సరాలైనా వారికి ఎలాంటి పెన్షన్ లేదు...

సిరిసిల్లలో 8 ఎకరాలు అన్యక్రాంతం అయింది అంటున్న ముఖ్యమంత్రి శ్వేత పత్రం విడుదల చేయాలి.. రాష్ట్రంలో ఎక్కడలేని విద్యా కేంద్రాలు సిరిసిల్లలో ఉన్నాయి..

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్,అక్షిత బ్యూరో:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన118దరఖాస్తులతో పాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు తెలిపారు.అదేవిధంగా అధికారులు మరియు సిబ్బంది మీ ప్రమాణం



మొబైల్ యాప్ ద్వారా తమ హాజరును (అటెండెన్స్) తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డిఆర్ఓ స్వర్ణలత, జెడ్పి సీఈవో సుధీర్, మరియు జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నదానం పుణ్యకార్యం

**మున్సిపల్ కమిషనర్. రమాదేవి మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్తిబాబు**

**కోదాడ అక్షిత ప్రతినిధి:** అన్నదానం పుణ్యకార్యమని కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి మాజీ సర్పంచి పైడిమర్రి సత్తిబాబు అన్నారు. సోమవారం కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని రంగా థియేటర్ లో పిత్రు మహాలయ పక్షాల సందర్భంగా ఏర్పాటు చేసిన 15 రోజుల అన్నదాన కార్యక్రమన్ని ఆమెముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.మొదటి రోజు అన్నదాన దాతగా గాదంశెట్టి అశ్వద్ధనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గాదంశెట్టి శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ నేటి నుండి 15 రోజుల



పాటు పిత్రు పక్షాల సందర్భంగా పేదలకు నిరంతరం అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పైడిమర్రి సత్తిబాబు, పైడిమర్రి నారాయణరావు, పందిరి సత్యనారాయణ, గరినే ఉమా, శ్రీధర్, చల్లా ప్రకాష్, ఇరుకుల్లా చెన్నకేశవరావు, కొత్తూరు శ్రీను, శంకర్, సాయి, చీదెళ్ల హనుమంతరావు, వెంపటి ప్రసాద్, పైడిమర్రి రామారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు




Edited, Printed, Published & Owned by Mathangi Guruvaiah, and Printed at Spoorthi Publications, H.No.7-1059/1, Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana, and Published at H.No.7-1059/1,Bangarugadda, Miryalaguda, Nalgonda District - Telangana. Editor : Mathangi Guruvaiah, Email : akshithadaily@gmail.com, Cell: 9000556444 RNI NO.APTEL/2011/37073

# అక్టోబర్ 2 జర్నలిస్టుల ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

## అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్

హైదరాబాద్, (అక్షిత ప్రతినిధి): జర్నలిస్టుల హక్కుల కోసం అక్టోబర్ 2న ఆందోళన కార్యక్రమంలో చిన్న పత్రికల సంపాదకులు, చిన్న పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని న్యాయమైన డిమాండ్ల సాధనకు సంఘటితంగా గళమెత్తుదామని తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికలు అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి వై ఎల్ అశోక్ ఒక ప్రకటనలో కోరారు.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే–ఐజేయూ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి అనుబంధ సంఘమైన తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్




సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

అక్టోబర్ 2న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జర్నలిస్టుల ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు.

జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కులు, భద్రత, సంక్షేమం, సామాజిక రక్షణ తదితర అంశాలపై ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులు విధి నిర్వహణలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని తమ ప్రకటనలో పేర్కొన్నారు.

ఐజేయూతో నాయకత్వంతో పాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ ఆందోళనలో చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు భాగస్వాములు కావాలని యూసుఫ్ బాబు, అశోక్ కోరారు.

"మన హక్కు-మన గళం--మన ఐక్యత" అనే నినాదంతో జర్నలిస్టుల హక్కుల కోసం సంఘటితంగా గళం వినిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న జరిగే ఆందోళనలో పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టుల ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు.

# ఎల్‌టీఆర్ కేసుల్లో అధికారుల "మాయ"!

- 90 ఎకరాల వివాదం.. ఐదు కేసులుగా విచారణనా?
- 18 ఎకరాలకే తీర్పు.. మిగతా 72 ఎకరాలపై మౌనం?
- 1980లలో వలస వచ్చిన గిరిజనేతరులకు 1970 ముందే ఉన్నట్లు పుట్టుకొచ్చిన సాక్ష్యాలపై గిరిజనుల ఆశ్చర్యం!
- బోడు గ్రామంలో బహుళ అంతస్తుల అక్రమ భవన నిర్మాణంపై ఆదేశాలు వెలువడినా చర్యలు శూన్యం
- ఐటీడీఏ కోర్టును ఆశ్రయించనున్న గిరిజన బాధితులు.

భద్రాద్రి కొత్తగూడెం, అక్షిత బ్యూరో: గిరిజన ప్రాంతాల్లోని భూములను రక్షించాల్సిన ఏజెన్సీ చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా? బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన, ప్రభుత్వ రికార్డుల వెరిఫికేషన్ చేయకుండానే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారా? అంటే అవుననే అంటున్నారు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలానికి చెందిన గిరిజన బాధితులు. రెస్పాండెంట్లు సమర్పించిన ప్రైవేట్ కాగితాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని, కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ వివాదాస్పద ఎల్టీఆర్ కేసులో ఇచ్చిన తీర్పులపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక పెద్ద ఎత్తున లోపాయికారీ వ్యూహం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### వలసదారులకు స్థానిక హక్కులా? ఆర్డీఓ తీర్పుపై గిరిజనుల విస్మయం

సదరు గిరిజనేతరులు 1980ల ప్రాంతంలో గుంటూరు జిల్లా నుండి ఇక్కడికి వలస వచ్చారని వృద్ధుడైన పిటిషనర్ పూనెం పాపయ్య , స్థానిక గిరిజనులు స్పష్టం చేస్తున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలు ఇలా ఉంటే, ఆర్డీఓ తీర్పు మాత్రం సదరు గిరిజనేతరులే అక్కడి స్థానిక గిరిజనుల కంటే ముందే (1970 కంటే ముందే) ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నట్లు పేర్కొనడం గిరిజనులను తీవ్ర ఆశ్చర్యానికి మరియు దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. పహనీలలో సదరు గిరిజనేతరుల పేర్లు ఇరికించిన విషయం రెవెన్యూ రికార్డులు చూస్తే అర్థం అవుతుందని, రికార్డుల ట్యాంపరింగ్ జరిగినా ఆ విషయాన్ని అసలు పరిగణనలోకి తీసుకోలేదని ఫిర్యాదు దారులు చెబుతున్నారు. తాము ఇచ్చిన ఆధారాలు పక్కన బెట్టి వలస వచ్చిన వారికి భూములపై సర్వాధికారాలు కట్టబెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటో అధికారులకే తెలియాలని బాధితులు ఆరోపిస్తున్నారు.

### 90 ఎకరాల భారీ కేసును 5 ముక్కలుగా చేసిన ఆర్డీవో

టేకులపల్లి మండలం కొప్పురాయి రెవెన్యూ గ్రామంలో సుమారు 10 మంది గిరిజనేతరులు అక్రమంగా పట్టాలు పొంది అనుభవిస్తున్న మొత్తం 90.20 ఎకరాల భారీ గిరిజన భూమిపై బాధితులు ఎల్‌టీఆర్ కేసు వేశారు. ఈ కేసులో కేవలం రెండు కుటుంబాలకు చెందిన వారే ప్రతివాదులు గా ఉన్నారు. అయితే, ఇంత పెద్ద భూ కుంభకోణం కేసును ఆర్డీఓ ఒకే కేసుగా లేదా రెండు కుటుంబాలకు చెందినవారు కాబట్టి రెండు కేసులుగా విచారించకుండా 5 కేసులుగా విడదీసి విచారించడం అనేక అనుమానాలకు తావిస్తోందనీ కేసు యొక్క తీవ్రతను తగ్గించడానికి, కాలయాపన చేయడానికి గిరిజనుల పోరాట బలాన్ని విచ్ఛిన్నం చేయడానికే అధికారులు ఈ వ్యూహం పన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. 18 ఎకరాలకు మాత్రమే తీర్పు ఇచ్చి మిగతా 72ఎకరాల విషయంలో మౌనం వహించడం ఎల్టీఆర్ చట్టాన్ని పరిహసించడమే అని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆర్‌టీఐ వేస్తే గానీ కదలని ఫైల్.. గిరిజనులపై అధికారుల వివక్ష

ఈ కేసు తీర్పు కాపీలను రెస్పాండెంట్లకు (ఎదురుపక్షానికి) అధికారులు ముందే అందజేశారు. కానీ గిరిజన బాధితులు ఆఫీసుకు వెళ్లి అడిగితే కేసు క్లోజ్ అయిందని అని ముక్తసరిగా చెబుతూ తీర్పు కాపీలు ఇవ్వడానికి రెండు నెలలుగా సతాయిస్తూ వచ్చారు. ఇదేమిటని అడిగితే మీరే వచ్చి తీసుకోవాలి మేమేలా పంపుతాం అంటూ వితండవాదం చేసిన



అధికారులు శనివారం సాయంత్రం వరకు కాలయాపన చేయడంతో విసిగిపోయిన బాధితులు... వెంటనే సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు దాఖలు చేశారు. బాధితులు ఆర్‌టీఐ అప్లికేషన్ వేసి ఆఫీస్ వదిలి వెళ్లకపోవడంతో, చేసేదేమీ లేక అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో సాయంత్రం 4 గంటల తర్వాత ఆ ఒక్క తీర్పు కాపీని బాధితులకు అందజేశారు. మిగతా నాలుగు కేసుల తీర్పులు రికార్డ్ గదిలో దొరకడం లేదు, గతంలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ బాల్య నాయక్ ను అడగండి అని చెబుతున్నారని తెలిపారు.




### బోడులో బహుళ అంతస్తుల భవనంపై ఆదేశాలు జారీ
### ఇంకా అందలేదంటున్న తహసిల్దార్, పంచాయతీ కార్యదర్శి

ఇదే వ్యవహారంలో మరో ఎల్టీఆర్ కేసు వివరాలు కూడా బాధితులు బయటపెట్టారు. బోడు రెవెన్యూ గ్రామంలోని మరొక గిరిజనేతరుడిపై కూడా ఎల్టీఆర్ కేసు నమోదైంది. అతడు అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా ఒక మూడు అంతస్తుల భవనాన్ని నిర్మించాడు. ఇక్కడ స్పష్టంగా ఎల్‌టీఆర్ చట్టం వర్తిస్తున్నప్పటికీ, ఆర్డీఓ తన తీర్పులో మాత్రం ఆ నిర్మాణానికి ఎలాంటి పంచాయతీ అనుమతులు లేవని, అలాగే అది గతంలో ప్రభుత్వ భూమి కాబట్టి దానిపై ల్యాండ్ ఎంక్రోచ్‌మెంట్ (భూ ఆక్రమణ) చట్టం కింద తక్షణమే చర్యలు తీసుకోవాలని టేకులపల్లి తహసీల్దార్‌కు, పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు ఇచ్చినట్లు తీర్పులో రాశారు. కాగా ఈ భవనం సాక్షాత్తూ బోడు గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రక్కనే నిర్మించాడు. అంతే కాకుండా పంచాయతీ కార్యాలయ భూమిని కూడా కొంతమేర ఆక్రమించినట్లు నిర్మాణాన్ని చూస్తే స్పష్టంగా అర్థం అవుతుంది. అలాగే ఆ నిర్మాణం చేసిన భూమి పదేళ్ల క్రితం వరకు కూడా బోడు గ్రామానికే చెందిన మరొక గిరిజనేతర కుటుంబం స్వాధీనంలో ఉండగా సదరు వడ్డీ వ్యాపారి దానిని కొనుగోలు చేసినట్లు గ్రామంలో ఎవరిని అడిగినా స్పష్టంగా చెబుతారు. కానీ ఎలాంటి స్థానిక విచారణ లేకుండా ఇలాంటి తీర్పు ఇవ్వడం ఆశ్చర్యానికి గురి చేసిందని, అయినా పై కోర్టులో తేల్చుకుంటామని ఆదివాసీ హక్కుల నాయకురాలు మడకం సమ్మక్క అక్షిత ప్రతినిధి కి తెలిపారు.

### ఐటీడీఏ కోర్టులో తేల్చుకుంటాం
### గిరిజన బాధితులు

ఈ చట్టపరమైన అన్యాయంపై తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని గిరిజన బాధితులు, సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ ఏకపక్ష తీర్పు కాపీలు అధికారుల లీలలన్నింటినీ ఆధారాలతో సహా భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ కమ్ అడిషనల్ ఏజెంట్ కోర్టులో అప్పీల్ రూపంలో సమర్పించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ తీర్పు కాపీలో తహసీల్దార్‌కు, పంచాయతీ కార్యదర్శికి అక్రమ భవనంపై చర్యల కోసం ఆదేశాలు పంపినట్లు ఉన్నా... క్షేత్రస్థాయిలో టేకులపల్లి మండల తహసీల్దార్ , పంచాయతీ కార్యదర్శి మాత్రం తమకు అలాంటి ఆదేశాలు అసలు అందనే లేదని ఖచ్చితంగా చెబుతున్నారు. కోర్టు రికార్డుల్లో ఆదేశాలు ఇచ్చామని రాయడం, కానీ కింద ఉన్న అధికారులకు ఆ కాపీలు చేరకపోవడం, గిరిజనులు ఆర్డీఓ కార్యాలయంలో రోజంతా పడిగాపులు గాచినా తీర్పు కాపీలు ఇవ్వకపోవడంపై దీని వెనుక రాజకీయ పెద్దల హస్తం కూడా ఉన్నట్లు గిరిజనులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ ఒరిజినల్ రికార్డులను రికార్డ్ రూమ్ నుండి తెప్పించి, సదరు గిరిజనేతరుల పేర్లు పాత పహనీలలో ఇరికించి రికార్డుల ట్యాపరింగ్ కు పాల్పడిన రెవెన్యూ సిబ్బంది పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.



# మౌలిక విలువల పరిరక్షణకే "రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక"

### సమాజహితం కోసమే "రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక" ఏర్పాటు
### - వేదిక కన్వీనర్ కె. రామచంద్రమూర్తి

హైదరాబాద్, అక్షిత: ప్రతి రంగంలోనూ విలువలు క్షీణిస్తున్న నేటి ఆందోళనకర పరిస్థితుల్లో, రాజ్యాంగం కల్పిం చిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే మౌలిక విలువలను పరిరక్షించేందుకే "రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక" (ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఏర్పాటైందని, ప్రముఖ పాత్రికేయులు, వేదిక కన్వీనర్ కె.రామచంద్రమూర్తి స్పష్టం చేసారు. సోమవారం నాడు బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ జి. హరగోపాల్, శాసన మండలి సభ్యులు యం. కోదండరాం, సామాజిక ఆలోచనపరులు డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి యం.వి.రెడ్డి, సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తిలతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో మొత్తంగా, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలలో, రాజ కీయ సంభాషణ రోజురోజుకూ దిగజారు తోందని, ఒకప్పుడు ఆత్మగౌరవం, పరస్పర గౌరవంతో కూడిన భాష స్థానంలో దూషణలు, అసత్యాలు, వ్యక్తిగత విమర్శలు చోటు చేసుకుం టున్నాయని, ఈ క్రమంలోనే సమాజంలో ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ విలువలు బలహీనపడు తున్నాయని రామచంద్రమూర్తి ఆవేదన వ్యక్తం చేసారు. భయమో, పక్షపాతమో లేకుండా స్వేచ్ఛగాతమ అభిప్రాయాలను వ్యక్తం చేయాల్సిన సమయం ఆసన్నమైనందు వల్లే ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేసారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విస్తృతమైన అంశమైనప్పటికీ, ఈ వేదిక ప్రధానంగా రాజ్యాంగ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం హామీ ఇచ్చిన విలువలు, హక్కులు, సంస్థల పరిరక్షణపై దృష్టి సారించడం శుభ పరిణామమన్నారు. కోట్లాది ప్రజల పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి ప్రజాస్వామ్య వేదికలను ప్రతి పౌరుడు స్వాగతించాలని ఆయన కోరారు. ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ, రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛలకు చురుకైన రక్షణ అవసరమని అన్నారు. ఈ కృషిలో పౌర సమాజం, విద్యావేత్తలు, మీడియా కీలక పాత్ర పోషించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రజల హక్కులు, సంస్థల స్వేచ్ఛలపై ఒత్తిడి ఏర్పడినప్పుడు సమాజం స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ, ప్రజా ఉద్యమాలు, ప్రజా సమస్యలపై వేదిక చర్చిస్తుందని, వాస్తవాలు, సమాచార ఆధారంగా జోక్యం చేసుకుంటుందని తెలిపారు. సంబంధిత వర్గాలకు సూచనలు, సిఫారసులు అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పరిరక్షణ పట్ల ఆందోళనలు, నిబద్ధతలను పంచుకునే పౌరులందరూ ఈ ప్రయత్నంలో తమతో కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేసారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓటు హక్కు పరిరక్షణ, డీలిమిటేషన్, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, ప్రయోజనాలను కాపాడాల్సిన అవసరాన్ని ఆమె ప్రస్తావించారు. సామాజిక విశ్లేషకులు డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలు, చట్టబద్ధ పాలనకు ప్రజల దృష్టి మరింత అవసరమైన సమయంలో ఈ వేదిక ఏర్పడిందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, పౌరుల్లో మరింత అవగాహన కల్పించేందుకు వేదిక పనిచేస్తుందని తెలిపారు. మాజీ ఐఏఎస్ అధికారి ఎం.వి.రెడ్డి ఈ వేదికను స్వాగతిస్తూ, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు తమ అను భవం, నైపుణ్యాలను రాజ్యాంగ ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛల పరిరక్షణకు వినియోగించవచ్చని అన్నారు. ఈ కృషికి మీడియా సహకారం అవసరమని, భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో అంతర్భాగా లని ఆయన పేర్కొన్నారు. ఈ వేదిక ఆధ్వర్యంలో సెమినార్లు, ప్రజా చర్చలు నిర్వహించడం, పరిశోధనలు చేపట్టడం, నివేదికలు మరియు సిఫారసులు ప్రచురించడం, పౌరులు మరియు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు జరపడం వంటి కార్యక్రమా లను చేపట్టాలని ఆయన ప్రతిపాదించారు. ఇంకా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్న లిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తి తదితరులు మాట్లాడారు.

# ప్రశ్నిస్తే ఫిర్యాదులా..? వార్త రాస్తే బ్లాక్‌మెయిలా..?

- ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కమిషనర్ తీరుపై జర్నలిస్టు ప్రశ్నలు
- సర్వసభ సమావేశానికి మీడియా అనుమతిపై కమిషనర్ లిఖితపూర్వక వివరణ
- సీడీఎంఏ ఆదేశాలపై వార్త
- మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీఐ సమాచారం
- నాలుగు విచారణలకు అధికారులు హాజరైనా సమాధానం ఎక్కడ?
- ఐదవ విచారణ నేడు









పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి : ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రశ్నలు అడిగి, ఆధారాలతో వార్తలు ప్రచురిస్తున్న జర్నలిస్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతూ వార్తలు రాసిన అనంతరం, సంబంధిత అధికారులపై ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో పరిణామాలు మరో మలుపు తిరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇస్నాపూర్ మున్సిపాలిటీలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి సంబంధించిన వార్తలో సమావేశం తలుపులు మూసివేసి నిర్వహిం చారని, మీడియాను లోపలికి అనుమతించలేదని జర్నలిస్టు పేర్కొన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ పత్రికకు ఇచ్చిన లిఖితపూర్వక వివరణలో.. కౌన్సిలర్లే చెప్పడంతోనే మీడియాను అనుమతించకుండా తలుపులు మూసివేసినట్లు పేర్కొన్నట్లు జర్నలిస్టు వెల్లడించారు. ఈ వివరణ నేపథ్యంలోనే సీడీఎంఏ డైరెక్టర్ కమిషనర్‌కు ఫోన్ చేసి, సర్వసభ సమావేశం తలుపులు మూసి ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు జర్నలిస్టు పేర్కొన్నారు. దీనిపైనా సంబంధిత వార్త ప్రచురితమైంది.



Citizen Copy
GOVERNMENT OF TELANGANA
Sangareddy District Prajavani Acknowledgment

| | | | |
|---|---|---|---|
| Grievance ID: | DSANG21092600062 | Grievance Date: | 21-SEP-2026 |
| Citizen Name: | Syed Majeed Ali | Mobile No.: | 9581455796 |
| Gist of Grievance: | Complaint on restricting entry of media persons into Isnapur Municipality council meeting-Reg. | | |

Your Grievance has been forwarded to the Isnapur Municipality - Sangareddy for resolution. Kindly note the Grievance ID for further reference.

This is a system-generated receipt. No signature required
"You can track the status using the above grievance ID on the Prajavani portal (prajavani.cgg.gov.in)."

### మూడేళ్లుగా ఆర్టీఐ సమాచారం కోసం నిరీక్షణ..

ఇదే సమయంలో 2023లో దాఖలైన సమాచార హక్కు చట్టం దరఖాస్తులో అడిగిన ప్రశ్నలకు ఇప్పటివరకు పూర్తి సమాచారం అందలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై సమాచార హక్కు చట్ట భవన్, ఎంజె. మార్కెట్ హైదరాబాద్‌లో జరిగిన నాలుగు విచారణలకు సంబంధిత మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ, ఎంపీడీవో, అధికారులు హాజరైనప్పటికీ సమాచారం అందలేదని జర్నలిస్టు చెబుతున్నారు. ఇటీవల మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తమ వద్ద సమాచారం ఉందని, అయితే గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి నుంచి సమాచారం పంపించాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారికి లేఖ రాసినట్లు పేర్కొన్నారని తెలిపారు. సమాచార హక్కు చట్టం ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా ఉందని ప్రభుత్వ అధికారిక ఆర్టీఐ సమాచారంలో పేర్కొంది. సమాచారం ఇవ్వకపోవడం లేదా ఆలస్యం చేయడం వంటి పరిస్థితుల్లో చట్టం అప్పీల్, ఫిర్యాదు తదితర మార్గాలను కూడా కల్పిస్తోంది.

### ఫిర్యాదు చేస్తే జర్నలిస్టుపైనే ఆరోపణలా?

అధికారుల పనితీరుపై ప్రచురించిన వార్తల ప్రతులు, సంబంధిత ఫిర్యాదు కాపీలు, తన వద్ద ఉన్న ఆధారాలను జతచేసి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు జర్నలిస్టు తెలిపారు. అయితే సంబంధిత అధికారిపై చర్యల అంశం పక్కన పెట్టి, జిల్లా పౌర సంబంధాల శాఖ (డిపిఆర్ఓ) అధికారులు తమ సంస్థ ఎడిటర్‌కు ఫోన్ చేసి జర్నలిస్టు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారనే ఆరోపణలు చేశారని, ఆర్టీఐ కింద ప్రశ్నలు అడుగుతున్నారని, జవాబుదారీతనం లేకుండా మాట్లాడుతున్నారని చెప్పినట్లు జర్నలిస్టు పేర్కొన్నారు.

### ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సింది ఎవరు...?

ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, అధికారిక రికార్డుల ఆధారంగా సమాచారాన్ని కోరడం, అధికారుల వివరణలను ప్రచురించడం జర్నలిజంలో భాగమేనని జర్నలిస్టు వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఏ జర్నలిస్టుపైనైనా బ్లాక్‌మెయిల్ వంటి ఆరోపణలు ఉంటే వాటికి ఆధారాలు, ఫిర్యాదు వివరాలు, సంబంధిత విచారణ ద్వారా స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. అధికారులపై ప్రశ్నలు అడిగితే అది బ్లాక్‌మెయిలా?

ఆర్టీఐ ద్వారా సమాచారం కోరితే అది తప్పా?

ప్రజా ప్రయోజన అంశాలపై వార్త రాస్తే జర్నలిస్టుపైనే ఆరోపణలు చేయడం ఎందుకు?

ఫిర్యాదులో సమర్పించిన ఆధారాలపై విచారణ ఎప్పుడు?

ఇవన్నీ ఇప్పుడు ఇస్నాపూర్ మున్సిపాలిటీ వ్యవహారంలో సమాధానం కోరుతున్న ప్రశ్నలుగా మారాయి. సంబంధిత అధికారులు తమ పూర్తి వాదనను, ఆధారాలను ప్రజలకు వెల్లడిస్తే ఈ వివాదంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. లేదంటే అక్షిత తెలుగు దినపత్రిక ఎవ్వరికి భయ పడకుండా.. ఎవ్వరికి లొంగకుండా.. జవాబుదారీతనంగా.. జర్నలిజంలో జర్నలిస్టుల విలువలు కాపాడుతూనే ముందుకు సాగుతోంది. ఇస్నాపూర్ పూరపాలక సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై త్వరలో మరో కథనంతో మీ ముందుకు అక్షిత తెలుగు దినపత్రిక ఉంటుంది. ప్రజల గొంతుకకు.. పారదర్శకతగా ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో ఉంటూ.. ప్రజా సమస్యలపై తమ కలంతో.. ప్రజలకు చైతన్యవంతులు చేస్తూ.. అవినీతి తిమింగిలాలపై అక్షిత కొట్లాడుతూనే ఉంటుంది.